

అల్లసాని పెద్దసగారి

వరూధిని

రాంషా

రాంషా&శిరీష పబ్లికేషన్స్,
సామర్లకోట 533 440

ACCNO 5511

తొలిముద్రణ: 1990

894-8133
RAMSHA
RAM

రు.5

ముద్రణ:
ధర్మచక్ర పవర్ ప్రెస్, సామర్లకోట 533440

నమస్కారం

లక్ష్మీదేవి తన స్తనాలపై కస్తూరి అలముకొంది. ఆమెను విష్ణువు కౌగలించుకున్నాడు. ఆ కస్తూరి అతని వక్షస్థలాన్ని హత్తుకొంది. ఆ ఉభయుల కౌగిట్లో భూదేవి కూడా ప్రవేశించి నట్లు నల్లని ఆ కస్తూరి చూపరులకు భ్రమ కలిగిస్తోంది. అందుకే ఆ దంపతులకు నా నమస్కారం

వరూధిని

ఆర్యావర్తంలో వరణ అనే నదిఒడ్డున కోట ఒకటి ఉంది. దాని శిఖరం ఆకాశాన్ని ముద్దు పెట్టుకొంటోంది. ఆ ఊళ్ళో ఉన్న మేడలకు వేసిన వెల్ల ధవళకాంతుల్ని ఈనుతూ ఆకాశంలోని చంద్రుని మధ్య ఉన్న మచ్చను కనబడకుండా కప్పి వేస్తోంది. ప్రతి ఊరూ ఒక ముత్యమైతే, అలాంటి ముత్యాలహారాన్ని ధరించిన భూదేవికి అరుణాస్పదమనే పేరుగల ఈ ఊరు నాయకమణిలా ఉంది.

ఆ ఊళ్ళో ఉన్న బ్రాహ్మలు అన్ని విద్యల్లోనూ నేర్పరులు. కనుక బ్రహ్మాదిగివొచ్చినా ముదిచేత మదితప్పిన వాడివిలే బొమ్మంటారు. ఆ ఊళ్ళో రాజులు పరశురాముణ్ణి సైతం పెంకితనంతో తమ వద్దకు పిలిపించుకుంటారు. ఆ ఊళ్ళో ఉన్న కోమట్లు కుబేరుడికైనా పెట్టుబడిపెట్టి వ్యాపారం చేయిస్తారు. ఆ వూళ్ళో ఉన్న అలగాజనం తమ నాగేటికొనతో భూమిని తొలిచి సాధించిన ఐశ్వర్యాన్ని పరమశివుడికి కూడా పంచిపెట్టి, అతడింక భిక్షాటనం చెయ్యకుండా నిరోధిస్తారు. ఆ ఊళ్ళో వేశ్యలు తమ నాట్యకళలో రంభాదుల్ని సైతం ప్రతిఘటించి కాసెకొంగున వారించి పంపించి వేస్తారు. యింత యెందుకు? ఆ వూళ్ళో పుట్టిన చిగురుకొమ్మకు సైతం చేవయెక్కువ.

ఆ ఊళ్ళో ఒక బ్రాహ్మణుడున్నాడు. అందంలో చంద్రుడిలా

ఉంటాడు; మన్మథుడిలా ఉంటాడు. నేరువిప్పితే ఆదిశేషువు అపరావతారమే. ఎన్నో యాగాలు చేశాడు; ఎన్నో పుణ్యకర్మలు చేశాడు. యెన్నెన్నో నియమాలు పాటిస్తాడు. బ్రాహ్మణజాతికే అతను అలంకారం. ఎప్పుడూ శిష్యులచేత చదివిస్తూనే ఉంటాడు. పేరుచూస్తే ప్రవరుడు; అందమా చిత్రించటానికి వీలులేనిది. ఆ వూరిని విడిచిపెట్టకుండా ఉంటాడు.

విరియపూచిన సంపెంగిపువ్వును ఏ తుమ్మెదా చేరలేదు. అంత చక్కని ప్రవరుణ్ణి ఏ జారవనితా చేరలేదు. అతనికి విషయ సుఖాలందు అనురక్తి లేదు.

యవ్వనంలో యెన్నో యాగాలు చేశాడు. డబ్బుకు కొదువలేదు. చిన్నప్పుడే జుట్టూజుట్టూ కొలిచి పెళ్ళి చేసిన సోమిదమ్మ అతనికిఅన్ని సుఖాలు కలిగిస్తూనే ఉంది. తలిదండ్రులిద్దరూపార్వతీ పరమేశ్వరుల్లా సమస్త సుఖాలూ పొందుతున్నారు. వాళ్ళే ఇంటిపనులన్నీ చూసుకుంటున్నారు. ఆయన సుఖంగా కాపురం చేసుకుంటున్నాడు.

ఆ వరణానదిలోని కమలాలు సగం వికసించి ఉన్న ప్రాతఃకాలంలో వగరువాసనలు విరజిమ్ముతాయి. ఆ వాసనలను పిల్లగాలులు మోసుకొచ్చి అందించే సమయంలో ఆయన మేల్కొంటాడు. లేస్తూనే వామనస్తుతి చేస్తాడు. చేసి, శిష్యులతో కలిసి నదికి వెడతాడు. నదిలో అఘమర్షణస్నానం చేస్తాడు. అంత తెల్లవారుఝామున నదిలో స్నానం చేస్తే సమస్త పాపాలూ పోతాయట! ప్రొద్దుపొడిచే సమయంలో సంధ్యావందనం చేస్తాడు. ఇనుక తిన్నెమీద కూర్చుని గాయత్రిని జపిస్తాడు. సూర్యోదయం కాగానే సూర్య భగవానుడికి నమస్కరిస్తాడు. ఈలోగా శిష్యులు దర్భలూ, పళ్ళూ, పువ్వులూ సేకరించి

సిద్ధంగా ఉంటారు. తెల్లగా ఉతికిన బట్టల్ని భుజాలపై వేసుకుంటారు. ఆ శిష్యుల్ని వెంటపెట్టుకుని ఊరంతా వెయ్య కళ్ళతో తనను చూస్తూ ఉండగా ఆ ప్రవరుడు ఇంటికొస్తాడు. ప్రతి రోజూ ఇలాగే జరుగుతుంది.

ఇతగాడి సత్ప్రవర్తనను విని, వంశమర్యాదలు తెలుసుకుని, మనోనిగ్రహాన్నీ, వాక్‌నిగ్రహాన్నీ గ్రహించి, లేతవయస్సునీ, చక్కదనాన్నీ చూసి-- ఈ బ్రాహ్మడే తామిచ్చు దానాలకు అర్హుడని భావించి, ఏ రాజు ఇయ్యవచ్చినా, ఎంత దానాన్నయినా పుచ్చుకోడు. అతని పూర్వులకు ఇదివరకే లభించిన మాన్యాలు అన్ని రకాలుగానూ పండుతూ ఉన్నాయి. ఇంట్లో పాడిపంటలకు తఱుగు లేనేలేదు.

వెయ్యిమంది భోజనానికి వచ్చినా వండిపెట్టటానికి కోపగించదు అతని భార్య. అన్నపూర్ణలాంటి మనిషి. అతిథులు వచ్చారంటే అర్ధరాత్రి అయినా అన్నం పెడుతుంది. వంటకు కావలసిన పదార్థాలన్నీ ఆ ఇంట్లో పుష్కలంగా ఉన్నాయి.

తీర్థయాత్రలు చేసి ఎవరెవరో వస్తారు. వారు వస్తున్నారని విని, ఈయన ఎంతదూరమైనా ఎదురువెడతాడు. వెళ్ళి తీసుకొచ్చి, భక్తితో ఆతిథ్యం ఇస్తాడు. ఇచ్చి, వాళ్ళకు ఇష్టమైన పదార్థాలతో సంతృప్తులయ్యేటట్లు చూస్తాడు. చూసి, వాళ్ళు సుఖంగా కూర్చున్న సమయంలో దగ్గరకు చేరతాడు. చేరి, ఈ ప్రపంచంలో ఉన్న సముద్రాల గురించీ, పర్వతాల గురించీ, నదుల గురించీ, పుణ్యక్షేత్రాల గురించీ అడుగుతాడు. అన్నీ వివరంగా అతనికి తెలిసేలా చెప్పించుకుంటాడు. ఏవేవి తనకు ఎంతెంత దూరంలో ఉన్నాయో, ఆ దూరం కూడా చెప్పమంటాడు. "వెళ్ళాలి, వెళ్ళాలి, ఎప్పుడో అవన్నీ

చూసి రావాలి!" అనుకుంటూ నిట్టూరుస్తాడు.

ఇలాగే కాలం గడిచిపోతోంది. ఒకరోజు ఉదయం-

జుట్టంతా ఒకేఒక్క జడగా చుట్టచుట్టి, దానికి పులితోలు కప్పిన సన్యాసి ఎదురయ్యాడు. చంకలో సంచీ ఉంది. చేతికి పంచలోహాలతోనూ చేసిన కడియం ఉంది. ఆచేతితో యోగదండాన్ని పట్టుకున్నాడు. ఆడులేడి చర్మాన్ని ఒడ్డాణంలా నడుముకు బిగించుకున్నాడు. ఆ బిగింపుకు అక్కళించుకున్న చొట్ట పెల్లుబికి పచ్చని శరీరచ్ఛాయను విరజిమ్ముతోంది. బక్కచిక్కిన శరీరం నిండా బూడిద పూసుకున్నాడు. మిట్టగా ఉన్న రొమ్ముపై వెడల్పయిన పట్టుపట్టెప్రకాశిస్తోంది. చెవులకు రుద్రాక్షపోగులు ఆడుతున్నాయి. కాషాయరంగు చొక్కా తొడుక్కున్నాడు. నీటితో నిండిన కమండలం రెండవచేతిలో ఉంది. ఈయన తిన్నగా ప్రవరుడి ఇంటిముందే ప్రత్యక్షమయ్యాడు.

ఆయన్ని చూసీ చూడగానే పరమయోగీంద్రుడన్న భావం కలిగి ప్రవరుడు భక్తితో ఎదురేగి నమస్కరించాడు. కాళ్ళు కడుక్కోవటానికి నీళ్ళు, త్రాగటానికి మంచినీళ్ళు ఇచ్చి, గౌరవ మర్యాదలు చూపించి, ఇష్టమైన వంటకాలు చేయించి, కడుపునిండా పెట్టాడు.

భోజనానంతరం ఆ యోగి విశ్రాంతి తీసుకొంటూండగా దగ్గర కూర్చుని-

"ఇవాళ నాఇల్లు పవిత్రమయింది; నేను చాలా అదృష్టవంతుణ్ణి. ఎక్కడినుంచి ఎక్కడికి పోతూ ఇక్కడికి వచ్చారో కదా! మీ మాటలు మంత్రాల్లాంటివి. మీరు అడుగుపెట్టిన చోటు ప్రయాగ, మీ పాదాలు కడిగిననీళ్ళే ఆకాశగంగ. మీలాంటివారుఎవరింట్లోస్నానాన్ని చేస్తారో, అన్నపానాలు చేస్తారో, ఎక్కడ ఆనందంతో గడుపుతారో

వాడిదే భాగ్యం, వాడిదే విశేషపుణ్యం, వాడిదే సార్థకమైన బ్రతుకు, వానిదే సరియైన జన్మ.

"మునీశ్వరా! సంసారమనే బురదలో కూరుకుపోయిన నావంటి గృహస్థుల్ని లేవనెత్తటానికి మీ పాదరజం కన్నా దివ్యౌషధం ఉందా?" అన్నాడు ప్రవరుడు.

"బాబూ! మాలాంటి తీర్థయాత్రీకులు తీర్థయాత్రలు చేయగలుగుతున్నారంటే మీవంటి గృహస్థులు సుఖంగా ఉండటం వల్లనే గదా! సమాజంలో ఎందరో చెవిటివాళ్ళున్నారు, గుడ్డి వాళ్ళున్నారు, కుంటివాళ్ళున్నారు. ఇంకా బ్రహ్మచారులు, వానప్రస్థులు,సన్యాసులు, అతిథులు, బౌద్ధభిక్షువులు, దిగంబరులు, కాపాలికులు ఉన్నారు. ఇలాంటి దిక్కులేని వారందరికీ గృహస్థు, ప్రక్కనున్న తంగేటిజున్నులాంటి వాడు; తొడమీద ఉన్న డబ్బుపెట్టి లాంటి వాడు; అంతులేని అమృతపు దిగుడు బావిలాంటి వాడు; సమీపంలోని మేరుపర్వతంలాంటి వాడు. మరుభూమిలో చలిపందిరి లాంటివాడు. ఆకలికి అందివచ్చే పంటలాంటివాడు. ఓయి బ్రాహ్మడా! గృహస్థాశ్రమానికి మరే ఇతర ఆశ్రమమైనా సరి పోతుందా?" అన్నాడు యోగి.

'అయ్యా! తమరు నానాదేశాలు తిరుగుతారు గావున కుతూహలం కొద్దీ ఎడమరిచి అడుగుతున్నాను. యేమీ అనుకోకండి!

'మహాత్మా! తమరు ఏయేదేశాలు తిరిగారు? ఏ పర్వతాల్ని చూశారు? ఏయే తీర్థాల్లో స్నానం చేశారు? ఏయే ద్వీపాలను మెట్టారు? ఏయే పుణ్యవనాలలో తిరిగారు? ఏయే సముద్రాల్ని చూశారు?అయా చోట్ల మీరు చూసినవి చూసినట్లుగా నాకు చెప్పండి.

"పోయి ఎలాగూ చూడలేను. పుణ్యతీర్థాలమహిమ విన్నా సకల

కల్మషాలూ పోతాయట! అంటూ వేడుకున్నాడు ప్రవరుడు.

"ఓ ప్రవరా! తీర్థయాత్రలు చేయాలన్న కుతూహలంతో నేను జనపదాలనూ పుణ్యనదులనూ నదాలనూ చూశాను; మొత్తం మీద మలయాచలం దాకా తిరిగి, అందలి చోద్యాలన్నీ గ్రహించాను.

కేదారేశుణ్ణి చూశాను. హింగుళా మహాదేవి పాదకమలాలను శిరస్సుపై దాల్చాను. ప్రయాగలో ఉన్న మాధవుణ్ణి సేవించాను. జల జంతువులకు ప్రభువగు సముద్రుడున్నాడు గదా! ఆయన కూతురు లక్ష్మి. ఆ లక్ష్మీపతియగు బదరీనారాయణుణ్ని చూశాను. అదీ ఇదీ కాదు, అన్ని దిక్కులందూ ఏమున్నా చూశాననుకో!

'అది అలా ఉంచు. ఉదయాచలం ఉంది. దానిమీద చమర మృగాలుంటాయి. సూర్యోదయం అయ్యేసరికి సూర్యుని రథానికున్న గుర్రాలను అలంకరించిన చామరాలను చూసి ఈ చమరమృగాలు అవికూడా తమజాతివేమోనన్న భ్రమతో మెడలు రిక్కించి చూస్తాయి. అప్పుడా ఉదయాచలపు అందాన్ని ఆదిశేషువు కూడా వర్ణించ లేడనుకో!

'మలయపర్వతం ఎంత చల్లగా ఉంటుందో చెప్పలేం. అందలి గంధపుమ్రానుల్ని ఏలకితీగెలు చుట్టుకుంటే ఆ చల్లదనం వేరే చెప్పాలా? ఈశ్వరుడు తమ భర్తయగు వాసుకిని మెడకు అలంకారంగా చేసుకున్నాడు కదా! పాపం, విరహంతో కుమిలిపోయే ఆడుపాములన్నీ ఆ చందనం చెట్లకు వ్రేలాడుతూ ఉంటే చూడవలసిందే.

"అస్తపర్వతం ఉంది. దాని శిఖరాగ్రాన మంచుతో పొడుచు కొచ్చిన చూరులేర్పడ్డాయి. ఆ చూరుకంతల్లోంచి చంద్రకాంతి పడి అమృతపు చినుకులు కురుస్తూ ఉంటాయి. ఆ చినుకుల చెమ్మలో

అందుగు చెట్లు పెరుగుతాయి. ఆ అందుగు చెట్ల చిగుళ్ళను పడ మటేనుగులు అందుకు తింటూ ఉంటాయి. నేనక్కడ రత్నశిలలపై సుఖంగా పడుకుని చూసిన యీ దృశ్యాన్ని తలచుకుంటే ఇప్పుడు కూడా నా వెళ్ళు గగుర్పొడుస్తోందనుకో!'

'ఉత్తరాద్రిపై పెరిగిన వృక్షాలన్నీ కుబేరుని భార్యలు పెంచినవే. ఆ వృక్షాలకు దోహదం చేస్తూ వాళ్ళు ఇటూ అటూ తిరుగుతూంటే వాళ్ళ కాలి అందెలు ఝళంఝళ అని మ్రోగుతాయి. ఆ చప్పుళ్ళను బట్టి మానస సరోవరమను భ్రమతో వెండికొండపై గల హంసలన్నీ ఎగిరి వచ్చి వ్రాలతాయి. దానితో శివుని విహారస్థలాలన్నీ వెల్లడై పోతాయి. ఇలాంటి దృశ్యాలను చూస్తే ఎన్ని దుఃఖాలయినా తొలగి పోతాయి బాబూ!

"ఆడవాళ్ళకు అలంకారాలపై మోహం కదా! ఐరావతమనే మగవినుగు కురవిందమణుల్ని త్రవ్వితీస్తుంటే అవేవో మండుతున్న కొఱివులనుకుని, దాని భార్య అభ్రమువు వాటి నుండి తప్పించుకు పోతుంటే చూడటం ఎన్ని జన్మల పుణ్యమో అనిపించింది. ఇలాంటి మహాద్భుతాలనన్నిటినీ భగవంతుని అనుగ్రహంతో కొద్ది కాలంలోనే చూశాను.' అన్నాడాయోగి.

అమాట వినగానే ప్రవరుడికి నవ్వు వచ్చింది. ఆ నవ్వును జాగ్రత్తగా బుగ్గల్లోనే అణచుకున్నాడు.

ఆ నవ్వు ఎందుకొచ్చింది? సర్వసంగపరిత్యాగి అయిన ఆయోగీంద్రుడు శృంగారవర్ణనలను అంత నిశితంగా చేసినందుకా? లేక, ఆ ఆడయేనుగుకు అలంకారాలపై ఉండేకోరిక కురవిందమణుల ఫ్రదనాన్ని చూసి బడుసుకుని తొలగి పోయినందుకా? లేక ఏమానవ

మాత్రుడూ ఒక జీవిత కాలంలో కాలినడకను చూడలేని చొప్పన్న దేశాలనూ ఆ యోగీంద్రుడు చూచివచ్చినట్లుగా బీరాలు పలుకు తున్నాడనా? యేమో! యేమయినా మర్యాదకోసం ప్రవరుడు తన నవ్వును బుగ్గల్లోనే అణచుకున్నాడు గదా!

'ఏమీ అనుకోకండి. మనస్సులో ఉన్న సందేహాన్ని నిర్భయంగా మీ ముందు పెడుతున్నాను. ఇలాంటివన్నీ చూసి రావటానికిరెక్కలు కట్టుకుని తిరిగినా కొన్ని యేళ్ళూ, పూళ్ళూ పడతాయి. మీ ముఖం చూస్తే మీది లేతవయసులాగే కనిపిస్తోంది. మీ మహిమలేవో మీకే తెలియాలి; మావంటి వారికి తెలియతరమా?' అన్నాడు ప్రవరుడు.

'సందేహం అడగటం తప్పటయ్యా! వినవయ్యా! మేము సిద్ధులం కదా! మమ్మల్ని రోగం గాని, వార్ధక్యంగాని చేరటానికి భయపడతాయి.

'అయినా ఒక పరమరహస్యం ఉంది. దాచకుండా చెపుతాను. వినవోయ్ బ్రాహ్మడా! పాదలేపమనుపేర ఈశ్వరుని కృపవల్ల దివ్యౌషధరసం ఒకటి నాదగ్గర ఉంది. దాని ప్రభావంతో నేను వాయువేగంతో, మనోవేగంతో తిరుగుతూ ఉంటాను. ఆకాశం మీద సూర్యుని గుర్రాలు ఏ అలసటా లేకుండా ఎంతదూరం వెడతాయో, భూమిమీద అంత దూరమూ మేము వెడతాము,' అన్నాడు సిద్ధుడు.

ఆమాటలు వినేసరికి ప్రవరుడికి తొట్రుబాటు కలిగింది. మహాత్ముల్ని అనుమానించానన్న ఆవేదన కలిగింది. తాను కూడాచప్పుచప్పున అదేవిధంగా తీర్థయాత్రలు చేసి రావాలన్న కోరిక కలిగింది. శ్రద్ధాంజలి ఘటించి-

'మునీంద్రా! మీ దివ్యప్రభావం తెలియని నాదురుసుతనాన్ని

క్షమించి, దయతో నన్ను మీ శిష్యునిగా భావించి తీర్థయాత్రలవల్ల ధన్యుడనయేటట్లు చేయండి' అని ప్రవరుడు ప్రార్థించాడు.

దానితో ఆ ముని తన పేముబుట్ట తెరచి, అందులో ఉన్న ఒక దంతపు భరిణినితీసి, అందులో ఉన్న పసరు వ్రేలికి రాసుకుని,అదేదో చెప్పకుండానే ఆప్రవరుని పాదాలకు వ్రాశాడు. వ్రాసి, వెళ్ళిపోయాడు.

ఈ ప్రవరుడు కూడా ఒక్క నిముషంలో కళ్ళుమూసుకుని యేదో తలచుకుని ఎగిరిపోయాడు.

అదొక పెద్ద మంచుకొండ, దాని శిఖరంమీద లేతాకుపచ్చ రంగులో మిసమిసలాడుతున్న అడవులున్నాయి. బంగారపుముద్దలతో మెరిసిపోతున్న లోయలున్నాయి. ఆ లోయల్లో ఒడ్డులొరసి ప్రవహించే సెలయేళ్ళున్నాయి. వాటిని రెప్పవాల్చక చూస్తూ నిలబడి పొయ్యాడు ప్రవరుడు!

అలాగే చూస్తూ ఆ బ్రాహ్మడు పరవశం పడిపోతున్నాడు. ఆ కొండలు ఆకాశాన్ని ముద్దుపెట్టుకుంటున్నాయి. వాటి శిఖరాలనుంచి సెలయేళ్ళు నేలకు దొర్లిపోతున్నాయి. అలా దొర్లుతున్నప్పుడు వాటి తరంగాలు మృదంగధ్వనుల్ని వినిపిస్తున్నాయి. ఆ ధ్వనులకు అనుకూలంగా కొండనెమళ్ళు పురివిప్పి నాట్యం చేస్తున్నాయి. ఆ నాట్యానికి అనుగుణంగా ఏనుగులు తమ తొండాలను చుట్టి కదిలించగా సాలవృక్షాలు తలలాడిస్తున్నాయి. మొత్తం హిమవత్పర్వతమే తాండవం చేస్తున్నట్లున్నది.

కన్నులవిందుగా ఆ దృశ్యాలను చూస్తూ, మనస్సు ఆనందంతో నాట్యం చేస్తూండగా కొండంతా కలియతిరగ బుద్ధిపుట్టి తనకెదురుగా కనబడిన త్రోవలో ప్రవేశించాడు.

[illegible] త్రోవలో నరనారాయణుల పాదపద్మాలంటిన గుర్తులు న్నాయి. చుట్టూ రేగుచెట్ల గుబుళ్ళున్నాయి. ఆదారి వెంట వెడు తున్నాడు ప్రవరుడు. పోనుపోను అలకానది అడ్డమైనది.

ఆ అలకానదీ తరంగాల నుంచి నీటి తుంపరులు ఎగిరెగిరి బండ్లపై ఉన్న కడిమిపూమొగ్గల పరిమళప్రవాహంలో మునుకు లాడాలన్న ఉత్సాహాన్ని చూపిస్తున్నాయి. అస్పుటమైన వాక్కులతో ఝుమ్మని ధ్వనిచేస్తున్న మదించిన గండుతుమ్మెదల వలె నాలుగు డిక్కులా విరజిమ్ముతున్నాయి.

తాము తిన్న మాంసపు అవశేషాలు పళ్ళల్లో చిక్కుకున్నందున, వాటికోసం అడవిఈగలు వాటి నేటిమూలల్ని దొలచుతున్నా లెక్కపెట్టక గుర్రుకొడుతున్నాయి పులులు.

సెలయేటిలంకల్లోని యిసుకదిబ్బల్ని తమ ముట్టెలతో త్రవ్వి, తుంగదుంపల్ని పెళ్ళగిస్తున్నాయి, మందలుమందలుగా పందులు! దూడలతో పెద్దవిగా పెరిగి, వాడికియూతలు దొంకల్లోంచి గెంతుతున్నాయి అడులేళ్ళు. [illegible] తమ బల్లేలవంటి గోళ్ళతో తేనెతుట్టను బితకకొట్టి తేనెటీగల్ని ఏగరగొడుతున్నాయి వెల్ల[illegible]ఉడ్లు.

ఇక ఆ తేనెటీగలు ఆకాశంలో చెలరేగిన సమయంలో వాటి మధ్య ఎండకాంతులు ప్రవహిస్తూ భూమి మువ్వలూ అయ్యమయా చల్లినట్టుంది.

ఈ విధంగా ఈ కొండ అరణ్యాలలోనూ, మహారణ్యాలలోనూ, ఎడారి అనబడే నిర్జలప్రదేశాలలోనూ, లోయల్ని, గుహల్ని, అడవుల్ని దాటుకొని [illegible]

సగరుని మునిమనుమడైన భగీరథుడు ఘోరతపస్సును చేసిన చోటు చూశాడు; ఆకాశగంగ ఆదికూర్మం కనబడేట్లుగా భూమి వైదెలగునట్లు నేలపై కురికినచోటును చూశాడు. సిగ్గువిడిచి పార్వతీదేవి మొగుణ్ణి సేవించటం కోసం ఆయాసపడ్డచోట్నూ చూశాడు. వలర్చాచ బిడ్డ అయిన మన్మథుడు ముక్కంటికంటిమంట్లకు బుగ్గి అయిన చోటును చూశాడు. సప్తర్షుల భార్యలయ్యిందుకు మక్కువతో వారి అందాన్ని తలచి తలచి అగ్నిదేవుడు విరహపడ్డచోట్నూ, రెల్లుగడ్డిలో దేవతల వడాలు (సేనానాయకుడు) పుట్టిన చోట్నూ చూశాడు.

ప్రళయకాలంలో కాలిబూడిదైపోయిన భూమి, యీ హిమవత్పర్వతపు చల్లదనాన్నే పొందకపోతే, తిరిగి తొలిరూపు పొందగల్లిగేదా? ఎప్పటివలె నిల్చి ఔషధుల్ని వెదజల్లగలిగేదా? ఈ భూమిమీద ఎన్ని ప్రళయాలు వచ్చినా, అన్నిసార్లు జీవం తిరిగి పుట్టడానికి ఈ హిమాద్రే కారణం కదా! అనుకున్నాడు.

పచ్చని పామును యజ్ఞోపవీతంలా వేసుకుని తిర్గిగే షణ్ముఖ గణాధిపతియైన ఈశ్వరుడు ఈ [illegible] గృహస్థ ధర్మాన్ని తెలుసుకున్నాడు. [illegible] కదా శివుడు తొలిసారి పెళ్ళాడారడ! [illegible]

ఆ దేవేంద్రుడు శచీదేవికి ఈ ఆకాశగంగలోనే [illegible] జలక్రీడలాడటం నేర్పాడు. [illegible]

ఈ కొండలమీదనే భూదేవి [illegible] ఔషధుల్ని [illegible] ప్రజలకు పంచి [illegible]

ఈ హిమవంతుడి [illegible] మేనకా ధైర్యాస్థైర్యాల్ని [illegible] అవి నలుగుతూ [illegible] వైధుర్య

నీల, గోమేధిక, మరకత, మాణిక్య, పుష్యరాగ, మౌక్తిక, ప్రవాళాలను అందంగా పొదిగిన నగలను ధరించి, విరివీగుతోంది.

సమస్త దేవతలూ ఏ రోజుకారోజు లభించు యజ్ఞసంపద లతో జిహ్వాత్రుప్పు రాలిపోవునట్లుగా విందుభోజనాలు చేస్తున్నారు.

ఆ దృశ్యాలన్నీ చూచి ప్రవరుడు చాలా సంతోషించాడు; ఇంకా చూడవలసినవెన్నో ఉన్నట్లుగా ఉంది; యెంత చూసినా తనివి తీరకుండా ఉంది.

ఏదో శబ్దం వినబడి అటు చూశాడు ప్రవరుడు. సూర్యకిరణాలు కాలుస్తుండగా ఎర్రబడి నిప్పులు కక్కుతున్నాయి సూర్య కాంతపు రాళ్ళు; అదే సూర్యకాంతికి కరిగి మంచుబిందువులు ఆ రాళ్ళపైబడి చుఱ్ఱుమంటున్నాయి.

'అబ్బో! మధ్యాహ్నమయిపోయిందే!' అనుకున్నాడు ప్రవరుడు. 'చాలు, ఇవ్వాళకి; మళ్ళి రేపు రావచ్చు!" ననుకున్నాడు ప్రవరుడు.

అనుకుని, ఇంటిమొఖం పెట్టి, ఇల్లును ధ్యానించాడు. ఈలోగా అతను కాలికివూసుకున్న పాదలేపం కాస్తా మంచుకు కరిగిపోయింది. ఆ సంగతి అతనికి తెలియనే లేదు. దైవంతలచుకుంటే కానిదంటూ ఉందా?

పాదాలకున్న పాదలేపం కాస్తా లేకుండాపోవటంతో తన ఊరు కు పోదామన్న ప్రయత్నంలో కాళ్ళురాక, మనస్సులో యెంతో అందో ళన పడ్డాడు...'ఓరి దేవుడా! సిద్ధుని వంకతో నన్నిట్లా ఘోరారణ్యానికి తీసుకొచ్చి పడేశావా?" అంటూ వాపోయాడు.

'ఎక్కడ అరుణాస్పదం? ఎక్కడి మంచుకొండ! క్రొవ్వెక్కి

ఇక్కడి కి వచ్చానా? ఎలా వచ్చానో, ఆ దారిఅయినా తెలియదే! ఎలా వెళ్ళగలను?

"పోనీ ఈ మందుమహత్యం ఏమిటో తెలుసుకుందామనిపించినప్పుడు, మాయ, ద్వారక, అవంతి, కాశి, కురుక్షేత్ర, గయ, ప్రయాగలలో ఏ ఊరో వెళ్ళక, ప్రాణాపాయకారులైన ఏనుగులు, అడివి పందులు, అడివిదున్నలు, ఖడ్గమృగాలు, పెద్దపులులూ ఉండే ఈ ఘోరాటవికి రావటమేమిటి? బుద్ధి జాడ్యజనితోన్మాదుల్‌కదా శ్రోత్రియుల్!

"ఒక్క నిముషమైనా నన్ను చూడకపోతే ఊరల్లా వెతికే మా నాన్నగారు ఎంత హడలిపోతున్నారో!

'సంజవేళల్లో నన్ను ఎన్నడూ ఇల్లువెడలనివ్వని తల్లి నాకోసం యిప్పుడు ఎంత ఏడుస్తోందో!"

'ఎప్పుడూ నా మనసును కనిపెట్టుకుని తిరిగే నా భార్య ఇప్పుడు నాకోసం యెంత ఏడుస్తోందో!"

"నాకు పక్కలో నీడలై తిరిగే శిష్యులు నేను కనబడక ఎంత విచారిస్తున్నారో!

'అతిధి సంతర్పణా లేమయ్యాయో! అగ్నులేమయ్యాయో! నిత్యకృత్యాలు జరగకుండా, ఓదైవమా, నీకేం కోపం వచ్చిందయ్యా, నన్నీ మిన్నులుపడ్డచోట పడేశావు?' అంటూ యేడ్చాడు ప్రవరుడు.

'నన్ను ఇల్లుచేర్చే ఉపాయంగల ఏ సుకృతి అయినా లేకుండా పోతాడా?" అనుకుంటూ విచారసముద్రంలో మునిగి భయంతో కొట్టుకుపోతున్నాడు ప్రవరుడు.

ఇంద్రుడి వజ్రాయుధం దెబ్బకి పగిలిన పర్వతపు దవడల

నుండి గంగానది ప్రవహిస్తోంది. దానికి రెండువైపులా ఇసుకతిన్నెల్లో సూర్యకిరణాన్ని సైతం చొరనివ్వని చీకట్లతో పోక, పొన్న, నారింజ, అరిటి, కొబ్బరిమొదలైన చెట్లున్నాయి. ఆ చెట్లపై కోయిలలు, గోరువంకలు, చిలకలు, నెమళ్ళు, తుమ్మెదలు, బెగ్గురుపక్షులు నానా రొదలనూ చేస్తున్నాయి. ఆ రొదలకు చంద్రకాంతగుహలు ప్రతిధ్వనిస్తున్నాయి. గంధర్వులు, యక్షులు తమ సంగీతనిర్ఝరుల్ని వినిపిస్తున్నట్లున్నది. మొత్తం మీద ఈ సంగీతాలన్నీ కలిసి ఆ కొండను తలక్రిందులు చేస్తున్నట్లే కనిపిస్తోంది.

ఆ కొండలోయలో ఒకమూల ఓ చిన్న కోన కనబడింది.

'ఇది ముని ఆశ్రమంగాని కాదుగదా! అక్కడికి వెడితే తప్పకుండా నాకు దోవ దొరుకుతుంది,' అనుకుంటూ, మనస్సును కొంతలో కొంత కుదుటపరచుకుని ఆ వంకకే బయలుదేరాడు ప్రవరుడు.

కొండ కొననుంచి తలక్రిందులా పడుతున్న సెలయేటి కాలువ గట్టుమీద మొలచిన మల్లెపొదల్ని చూశాడు. జాగ్రత్తగా ఆ మల్లెతీగల్ని పట్టుకుని ఆ సెలయేటి గట్టుమీదకు యెక్కాడు. ఆ తీగెలమీద విరిసిన మల్లెపువ్వుల మీదవ్రాలి, తేనెను గ్రోలుతున్న తుమ్మెదలు ఒక్కసారిగా ఝుమ్మంటూ లేచి, అతనిచుట్టూ పెద్ద రొద చేస్తూ తిరుగుతున్నాయి. ఎలాగో వాటిని తప్పించుకొంటూ అతగాడు మణులుపొదిగిన మెట్లదారిలోకి దిగి నాలుగడుగులు వేశాడు.

అంతలో పరిచేను కనిపించింది. దానిమధ్య కొలనులో ఎర్రకలువలు విరియబూసి వగరుపరిమళాన్ని వెదజల్లుతున్నాయి. ఆ చేనుగట్టుపై మామిళ్ళూ, ఎర్రగోరింటపువ్వులూ ఒకదానితో ఒకటి

అలము కున్నట్టున్నాయి. పెద్దవనంలా ఉంది. దానిమధ్య చంద్రకాంత శిలాస్తంభాలతో నిర్మించిన పందిరి ఉంది. ఆ పందిల్లో ద్రాక్ష గుత్తులూ, పూతీగెలూ ప్రకాశిస్తున్నాయి. దాని వెనుక గరుడపచ్చలచే పొదగబడినట్లుగా ఒక భవనం కనిపించింది. ఆశ్చర్యంతో ప్రవరుడా భవనాన్ని చూస్తున్నాడు.

ఏమిటీ తాంబూలపరిమళం! ఒక పాలుకస్తూరి, రెండుపాళ్ళు పచ్చకర్పూరమూ కలిసివచ్చే వాసనది! 'ఆహా! ఆడ వాసనలాఉన్నదే! ఎవరో ఒక స్త్రీ యిక్కడ ఉండాలి!" అనుకున్నాడు ప్రవరుడు.

అనుకుంటూ ఆ తాంబూలపు వాసన వస్తున్న దిక్కునువాయు ప్రసారాన్ని బట్టి పసిగడుతూ తలరిక్కించి తొంగి చూశాడు.

అనుకున్నట్టే అయింది . పద్మాల్లాంటి కళ్ళు, తుమ్మెదల్లాంటి జుట్టు. చంద్రునిలాంటి ముఖం, చక్రవాకాల్లాంటి స్తనాలు, లోతైన పొక్కిలిగల నారీరత్నాన్ని చూశాడు.

ఇంటిముందున్న తియ్యమామిడి గున్నచుట్టూ అరుగు ఉంది. ఆ అరుగుపై తెల్లనిమణులు పొదిగి ఉన్నాయి. ఆ మణుల మధ్య కూర్చున్న ఆ ఒయ్యారి హొయలను శీతలనీలం నిమురుతోంది. ఆ అమ్మాయి ఎర్రని పావడా (పరికిణీ) కట్టుకొంది. దానిపై తెల్లపల్చని రవపెల్లా పిరుదులమించి త్రిప్పి, పైటగా వేసుకొంది. చంద్రకాంత శిలలపీటపై కూర్చున్నదేమో ఆ పావడా ఎర్రరంగు ఆ పల్చని తెల్లరవపెల్లాను దాటి చంద్రకాంత మణులకు కూడా కన్నెర్ర కలిగిస్తున్నది.

వీణను వాయించటం కోసం సరిజేసి రొమ్ములకు హత్తుకున్న దేమో, వీణ పొరకాయలు రెండూ ఆమె స్తనాలను పట్టినెక్కి, మరింత

పెద్దవిగా కనిపింపజేస్తున్నాయి. స్తనాగ్రాలకు కలిగిన మదన ప్రేరణతో పరవశించి అనురాగస్నిగ్ధమైన మునివ్రేళ్ళను వీణాతంత్రులపై మీటుతూ ఆమె రాగనిర్ఝరులను వెలికించి, అందులో తన సన్నని కంఠాన్ని లీనం చేస్తున్నది.

అప్పుడామె అరమోడ్పు కనుదోయిలో రతిపారవశ్యం ఒలికి పోతున్నట్లున్నది. వీణ మెట్లపై నాట్యం చేస్తున్న ఆమె కరపద్మాలు, మణికంకణాల ఝణంఝణ తాళప్రమాణాలను వినిపిస్తూ, కొత్త అందాలను దీపిస్తున్నాయి.

ఆమెను అలాగే తేరిపారచూస్తూ ప్రవరుడు నిరుత్తరు డయ్యాడు.

ఆమెకూడా అతన్ని చూసింది. ఆశ్చర్యంతో ఆమె కళ్ళు వికసించాయి. కళ్ళల్లో కాంతి పెల్లుబికి నల్లగుడ్లు నీలోత్పలాలను క్రుమ్మరించాయి. ఆమె గుబ్బచన్నులు ఒక్కసారిగా గగుర్పొడిచాయి. ఆమె మనసులో ఎన్నో కోరికలు అకస్మాత్తుగా పొటమరించాయి.

ఈ బ్రాహ్మడు ఆమె కంటికి కుబేరుడి కొడుకులా కనిపించాడు.

మళ్ళీ చూసింది వరూధిని, చూసి ఝళం ఝళమని మ్రోగు తున్న అందెలు ఆమెకాళ్ళు కదలిన వేగాన్ని సూచిస్తుండగా లేచింది. స్తనాలు, కొప్పు, సన్నని లేతనడుము అల్లలాడగా నడిచి, దగ్గరలో పూచి పువ్వులు వెదజల్లుతున్న పోకచెట్టు క్రీనుమీద ఆనుకుంది. ఆ క్రీను సన్ననిది, దానిని ఆనుకుని ఆ ప్రవరుడు వస్తున్న దారిని కళ్ళు విప్పి చూస్తున్నది.

ఆమెలతాంగి అనగా సన్నని తీగెవంటి నడుము గలది. ఆమెకు అతన్ని చూడగానే ముందుకొంత భయంవేసింది. ఆ తర్వాత

మనస్సు చలించి లోలత్వం కలిగింది. మనసులో కోరికలు గంతులు వేశాయి. అతని రూపురేఖావిలాసాలను మనస్సునందే మెచ్చుకుంది. అప్పుడామె కనురెప్పలు చలించాయి. అతను అంత కంతకీ దగ్గరౌతున్న కొద్దీ ప్రేమ్నపడింది. ఆమె వయ్యారం విలాసాలనుచిందింది– ఆమె తామరపద్మాలవంటి కళ్ళు మరింత వికాసాన్ని పొందినాయి. అలాగే ఆ భూసురుణ్ణి చూస్తూ ఉండి పోయింది.

ఆసమయంలో ఆమె అతన్ని చూస్తున్నంతసేపూ ప్రేమ్నపడిన ఆమె శరీరంపై గగుర్పాటు కలిగింది. అప్పుడు రిక్కపొయినవెంట్రుకలు ఆమె శరీరంలో రగుల్కొన్న మన్మధాగ్నిని సూచించే పొగలమొలకలవలె కనబడుతున్నాయి!

దట్టమగు వెంట్రుకలు గల ఆమె కనురెప్పలు మన్మధ వికారానికి బరువెక్కగా వాటిని కష్టంమీద పైకెత్తిపట్టటానికి ప్రయత్నిస్తున్నది. అప్పుడు వికసించే కన్నుగవ. ఆమె ముఖబింబాన్ని పూర్తిగా ఆక్రమించకుండా హద్దు ఏర్పరచెనో ఏమో అన్నట్లుగా ఆమె నుదుటను పెట్టుకున్న కస్తూరిబొట్టు చిరుచెమట చేతకరిగి, లలాటం దిగి చెక్కిళ్ళపై రెండువైపులా వలయాకారపు రేఖల్ని గీసింది.

ఆమె దేవతాకాంత, కనురెప్ప పాటెరగనిది. కాని, ఆమె మనుష్యునియందు లోలత్వం పొందటం చేత మానుషత్వం వచ్చిందేమో అన్నట్లుగా ఆమె బిత్తర చూపులామె అనిమేష స్థితిని పోగొట్టాయి. చెమట అంటూ ఎరగని దేవతాకన్య అయినా ఆమెకు ఒళ్ళంతా కొత్తగా చెమట పట్టింది, జ్ఞాన సంపత్తికి ప్రసిద్ధికెక్కిన ఈ దేవతా స్త్రీకి ఈ సమయంలో విభ్రాంతి కలగటం ఆశ్చర్యంగానే ఉంది.

అతని రూపురేఖా విలాసాలకు ఈవిధంగా ఆమె సృక్కిపోతూ

మనసులో ఇలా అనుకొంది,

"ఎక్కడివాడో? కుబేరుని కొడుకునీ, చంద్రుడినీ, ఇంద్రుని కొడుకయిన జయంతుడినీ, వసంతుడినీ (మన్మథుడు)చక్కదనంలో గెలవగల సమర్థుడు; కాకపోతే బ్రాహ్మణులు ఎక్కడ? ఇంత అంద మెక్కడ? ఈయన నన్ను పరిగ్రహిస్తే చాలు మన్మథుణ్ణి నాకు బాని సను చేసుకోనా?

"ముత్యంలాంటి నీటిలో పుట్టిన కమలాలవలె ఉన్నాయి ఈయన కళ్ళు. వీని భుజాలు పైకి ఎగసి చెవులతో పరిహాసాలాడుతు న్నట్లున్నాయి. విశాలమైన ఇతని ఛాతీ మన్మథసింహాసనంలాఉంది. వీరి పాదాలు చిగురుటాకుల ఎర్రదనాన్ని ధిక్కరిస్తున్నాయి. బ్రహ్మ జంబూనదిలోని బంగారపు మట్టిని తెచ్చి సూర్యుని సొనపెట్టి నప్పుడు రాలిన రజనును అమృతంతో తడిపి తయారుచేశాడేమో! లేకపోతే ఇతనికీ మేనికాంతి యెలా వస్తుంది?

'సురలు, గరుడులు, ఉరగులు, నరులు, ఖేచరులు, కిన్న రులు, సిద్ధులు, సాధ్యులు, చారణులు, విద్యాధరులు, గంధర్వులు అను జాతులన్నింటిలోనూ వయసువాళ్ళని చూస్తూనే ఉన్నాను గదా! ఎవరూ ఇంత అందంగా లేరేమి?'

ఈవిధంగా ఆమె ఆలోచనలు పరిగెడుతున్నాయి. మన్మథుడు తన వింటినుంచి విడిచిన బాణాలు బాధిస్తూనే ఉన్నాయి. మబ్బు కమ్మిన ఆకాశంలా మనస్సు ఆందోళనతో నిండి మూర్ఛపోయిన పద్మంలా ఉంది. తొందరపాటుతో సిగ్గు బీటలు వారుతోంది. ఇకఆగ లేక కాలిగజ్జలు మ్రోగుతూండగా పోకమ్మీనును విడిచి ఆమె అతనిదారి కడ్డంగా నిలబడింది. ఆమెను చూస్తూనే అతను విభ్రాంతుడయ్యాడు.

'భయపడ్డ లేడికన్నులు గలదానా? ఎవ్వతెవీవు? ఈవనంలో నువ్వు వంటరిగా తిరుగుతున్నావేమి? భయం లేదా? నేను బ్రాహ్మణుడను. నాపేరు ప్రవరుడు. క్రొవ్వెక్కి ఈ కొండకొసకు వచ్చి, దారి తప్పిపోయాను. ఇక నేనెలా మావూరు చేరగలనో ఆ దారి చెప్పవా, నీకు పుణ్యముంటుంది.'

అతని కథ చెప్పాడు ప్రవరుడు. దారితప్పిన బాటసారి అని తెలిసేసరికి ఆమె కళ్ళు ఆనందంతో మెరిసిపోయాయి. దానితో ఏలా సం వెల్లివిరిసింది. ఆమె చెవికమ్మలు అల్లలాడాయి. చనుగవ అదిరింది; నడుము వణికింది. ఫకాలుమని నోరారా నవ్వింది.

'ఇంతలేసి కన్నులున్నాయ్, బ్రాహ్మడా! ఎవరినడుగు తావ్ దారి? ఒంటిగా ఉన్న పడుచుపిల్లల్ని ఏదో వంకపెట్టి పలకరించటం కోసం కాకపోతే, ఇంతకుముందు ఎలావచ్చావో నీకు తెలియదా? నీకింత భయంలేకపోవటానికి మేమింత అలుసయిపోయామా ఏమి! మాటలెందుకు?' అని మనసులోభావాన్ని మభ్యపెడుతూ మూతి ముడిచింది.

'ఆ బాలచంద్రుడి తోబుట్టువైన లక్ష్మీదేవి మాకు తోబుట్టువే. రక్తిపుట్టి రాళ్ళు కరిగేటట్లుగా నోటితో పాడగలం; వీణపై వాయించ గలం, స్వచ్ఛమైన సంగీతమే మాకున్న విద్య. రతిరహస్యాలను వెలిబుచ్చే వాక్యాలు పలికే సామర్థ్యం మాకు వెన్నతోబెట్టిందే . అశ్వమేధం, రాజసూయం అని పేరు వడ్డయజ్ఞకర్మలన్నీ మాకోసం ఇచ్చే ఓలి (స్త్రీధనం). మేరు పర్వతం మీద, కల్పవృక్షంనీడలో వచ్చలు పొదిగిన నాపరాళ్ళ వితర్ది మాకు రచ్చపట్టు; బ్రహ్మ విష్ణువు మహేశ్వరుల ఆస్థానాలలో మేము సాముగరిడీలను నేర్చుకుంటాము,

తెలుసా? ఓ బ్రాహ్మడా! నా పేరు పరూధిని. ఔదార్య పతులుగా పేరు పొందిన ఘృతాచి, తిలోత్తమ, హరిణి, హేమ, రంభ, శశిరేఖలు మావాళ్ళే; నాకు ప్రాణసఖులు.

'చూశావా ఈ గుహల్లో వెలుగుతున్న రత్నాలకాంతులు! ఆకాశగంగ మీంచి వచ్చే శీతలవాయువులు కదలిస్తుంటే కదలాడే ఈ పూగుత్తుల పరిమళంలో మత్తెక్కిన తుమ్మెదల్ని చూశావా? అందుకే మేమీ మంచుకొండల్లో తిరుగుతూ ఉంటాం. ఇదిగో, ఈ కల్పవృక్షాలన్నీ నా తోటలోవే' అన్నది.

నేను వంటరిగా వున్నానని చెప్పింది. నీ ఇంటిదారి నాకెందుకులే పొమ్మంది. ఒంటరిగా ఉన్న పడుచుపిల్లల్ని పలకరించటం మర్యాద కాదంది. సంగీతంలో తనకు తిరుగులేదంది. లక్ష్మికి తోబుట్టువునని చెప్పింది. తాను మాట్లాడితే రతిరహస్యాలను వేదవాక్కుల్లా ఒలక బోస్తానంది. మాకోసం యజ్ఞయాగాలను ఓలిగా పెట్టే బ్రాహ్మణులు నీకంటే గొప్పవాళ్ళున్నారంది. బ్రహ్మ విష్ణు మహేశ్వరుల ఇళ్ళు తనకు వాకిళ్ళు అన్నది. మేరు పర్వతంమీద కల్పవృక్షపునీడలో పచ్చలో పొదిగిన వేదిక మీద కూర్చుంటానన్నది. ఆవిధంగా బెదర గొట్టింది. ఆశపెట్టింది. రతికి రాత్రింపవళ్ళు లేనివిధంగా వెచ్చగా పనికివచ్చే నిత్యకాంతులీనే రత్నాల గుహలున్నాయంది.

మొత్తంమీద బెదిరిపోయి ఉంటాడేమో ఈ బ్రాహ్మణుడను కొంది. తానేదో మర్యాదస్తురాలిలా ముఖం పెట్టి నవ్వుతూ

"ఓ బ్రాహ్మణ రూపంలో వచ్చిన మన్మథబాణమా! మాఇంటి కిప్పుడు చుట్టానివయ్యావు. మణులు పొదిగిన మా ఇంట్లో కాసేపు కూర్చుని, అలసట తీరాక, నా ఆతిథ్యాన్ని స్వీకరించవయ్యా!

'అపరంజి బంగారంలాంటి నీ శరీరం ఈమధ్యాహ్న పు ఎండవేడి కొట్టి కందిపోయింది; సొగసులొలికే నీ మొగం వాడిపోయింది. మా ఇల్లు పావనం చేసి, శ్రమతీర్చుకుని, వెళ్ళిపోవయ్యా!' అన్నది వరూధిని.

'అండజయాన! నీవు చేయదలచిన సపర్యలన్నీ మాకు ముట్టినట్లే అనుకుంటా కాని, మేమిక్కడ వుండకూడదు; మావూరు వెళ్ళిపోవాలి. మీ ఇంటికి నేను రాకపోతే ఒకటి, వస్తే ఒకటినా? భక్తి ఉంటే చాలదా? ఇంకా స్నానమయినా చేయలేదు. చప్పున ఇంటికి పోవాలి, కాస్త కరుణించు.

'నేను ఇల్లుచేరే ఉపాయంయేది? మీమహత్యాలు చాలా గొప్పవి. మీరు మనసులో తలచుకుంటే అసాధ్యమైనవేవీ లేదమ్మా! తల్లీ నన్ను నావిల్లలతో చేర్చు' అంటూ ప్రతిమాలాడు.

విశాలమైన తెల్లనికళ్ళు గల ఆయింతి ముఖంలో చిరునవ్వు చిందించి, ఇలా అంది–

"ఇంకెక్కడూరయ్యా! కాలునిలవక ఇంటికిపోతానంటావేమిటి? మీ తాటాకుపాకలకు సరిపోలేదా ఏమిటి? ఇక్కడి రత్నకందరాలు! (గుహలు); ఇక్కడి నందనోత్కరాలు! (నందనవనంలోని మంచి గంధపు చెట్ల గుంపులు); ఇక్కడిగాంగసైకతాలు (గంగానదికి చెందిన ఇసుకతిన్నెలు); ఇక్కడి లవలీనికుంజాలు (వెన్నెల తీగలతో అల్లిన పొదరిండ్లు);" అని చిరుకోపాన్ని ప్రకటించింది. కోపానికిది సమయం కాదనుకుని, తన మనస్సును తిరిగి సంబాళించుకుని

" నిక్కము దాచనేల, ధరణీసురనందన! నీపయిన్ జిక్కె మనస్సు నాకు!" అని వాపోయింది. "నన్నా క్రూరమన్మథ తాపానికి

అప్పగించి వెళ్ళిపోతావో, లేక పూదోటను సారాలా త్రాగి మత్తెక్కి పాటలుపాడే తుమ్మెదలు గల పూల పొదరిళ్ళలో నన్ను కౌగలించుకుని గౌరవిస్తావో!" అన్నది.

ఆ మాటకు ప్రవరుడు ఒప్పుకోలేదు. అలా మాట్లాడటం మంచిదికాదన్నాడు. వ్రతాలతో రోజులు గడిపే బ్రాహ్మణుల్నికామించటం మంచిది కాదన్నాడు. తొందరపడకుండా కాస్త మనస్సుతో నిదానంగా ఆలోచించమన్నాడు.

'ఓ అమ్మాయి! హోమాలు, దేవతార్చన, బ్రాహ్మణ పూజ ఇంకా మిగిలిపోయాయి. భోజనాల సమయం దాటిపోయింది. నా తలిదండ్రులు చాలా ముసలివాళ్ళు. ఆకలికి సోలిపోతూ ఉంటారు. విచారంతో నాకోసం ఎదురుచూస్తూ ఉంటారు. నేను ఆహితాగ్నిని, ఈరోజు నేను ఇల్లుచేరకపోతే సమస్తధర్మాలూ చెడిపోతాయి," అంటూ దీనంగా మనవి చేసుకున్నాడు ప్రవరుడు.

వరూధిని ముఖం చిన్నబోయింది. ఆమెలో ఏదో ఉత్కంఠ జనించింది.

"మన్మథుడిలా ఉన్నావు మహాభాగా! ఇంత చిన్నవయసులో వైదిక కర్మనిష్ఠల్లో కాలక్షేపంచేస్తే, యిక భోగాలు యెప్పుడు పొందుతావు? యెన్నో యజ్ఞాలుచేసి పుణ్యాత్ములైనందుకు వచ్చే ఫలం మాకౌగిళ్ళేకదా! అది అనాయాచితంగా నీకు లభిస్తోంది.

"చూశావో లేదో, ఎరియబారిన కస్తూరీ మృగాల నాభులనుంచి తెచ్చిన కస్తూరి పరిమళిస్తోంది. ఇప్పుడే ఎండకు కరిగి ఘుమఘుమలాడుతోంది జవాజి. కర్పూరపు చెట్లలోనుంచి తనకు తానే రాలినపచ్చ కర్పూరపు పొడి ఇక్కడే ఉంది. గొజ్జంగి పూల పొదల నుంచి కురిసిన

పన్నీరు ఈ కటికనేలమీద స్వచ్ఛంగా నిండింది. చూడు! ఎన్ని రకాల పువ్వులున్నాయో ఇక్కడ! దేవతావృక్షాల బెరళ్ళనుంచి తయారు చేసిన మెత్తని వస్త్రాలున్నాయి. మంచి పళ్ళున్నాయి; రకరకాలమద్యాలున్నాయి. అసంఖ్యాకమైన రత్నభూషణాలున్నాయి; భోగాలాలసుడవై రోజూ నన్ను రమించవయ్యా! అని నోరు విడిచి అడిగింది.

'గ్రుడ్డివాడికి వెన్నెల ఉండి లాభమేమిటి? గుడ్లగూబ వెలుతురును చూసి చీకట్లో దాంకున్నట్లు మావంటి గంధర్వాంగనలపొందును కాదని సంసారకూపంలో పడతానంటావేమిటి? అని జాలి పడింది.

'మన్మథపీడచే వాడి వత్తలయి, చేతిలో చెక్కిలిని పెట్టుకుని, చూపుల్లో దైన్యం ఉట్టిపడగా, కంటివేదురు (Love at first sight)తో (ప్రియుని) గాలిసోకినంత మాత్రాన వెన్నలా కరిగిపోయే అలివేణుల్ని కౌగిట్లో చేర్చుకునే భాగ్యం యెన్ని జన్మలెత్తితే కలుగుతుందయ్యా! అని ఆశ పెట్టింది.

" ఈలోకంలో ఎన్నో వ్రతాలు చేస్తావు; ఆకలిన్ని జయిస్తావు; ఉపవాసాలు చేస్తావు; ఇంద్రియాలను జయిస్తావు; శరీరాన్ని శుష్కింప చేస్తావు--ఇన్ని చేసి చచ్చిన తర్వాత నువ్వు పొందగల స్వర్గం అప్సరస్త్రీ సంగమమే కదయ్యా? అదేదో ఇప్పుడే, ఈ శరీరంతోనే నీకు లభిస్తుంటే దానిని వదులుకుని నీ జీవాత్మను క్షోభపెట్టటం మంచిదేనా?" అని జ్ఞానోపదేశం చేసింది.

'నువ్వు చెప్పింది నిజమే. కాముకుడయిన వాడికి అదే మంచిది. నేను నిష్కామకర్మలు చేస్తున్నాను. నాకా అవసరం లేదు. జలజాక్షీ! నీకు తెలిస్తే నా ఊరు పోయేదారి చెప్పి పుణ్యం కట్టుకో!

'బ్రాహ్మణుడు ఇంద్రియాలకు వశుడై వక్రవ్యాపారాలలోపడి,

మన్మథబాణాలకు వశుడయితే బ్రహ్మానంద పదవినుంచిజారి చెడిపోతాడు' అన్నాడు ప్రవరుడు.

అయినాసరే వరూధిని ఎనిపించుకోలేదు. మన్మథబాణాలు ఎడతెరిపి లేకుండా ఆమెను వేధిస్తున్నాయి. దుర్భరమైన మన్మథ తాపంతో ఆమె స్రుక్కిపోతున్నది.

సాటిలేని శరీరకాంతితో వెలిగిపోతున్నది; కల్పవృక్షం లోంచి వచ్చిన మద్యాన్ని త్రాగిఉన్నదేమో కైపెక్కి ఉన్నది. కన్నె ప్రాయంలో ఉన్నదేమో మదించి ఉన్నది; శివుడినైనా సరే తన సొగసు వలపించు నన్న ఆత్మవిశ్వాసంతో ఉరకలేస్తున్నది వరూధిని.

తంగేటిచెట్టుపై ఉండే తేనెపట్టులా సులభసాధ్యుడై కనిపించాడు ప్రవరుడు వరూధినికి. ధూర్తుడు కాదు ప్రవరుడనుకొంది. చేజిక్కిన వాడు త్రోసిపోలేడనుకొంది, కడగంటిచూపులతో అతన్ని ఊరించింది. చక్కగానే ఉన్న కొప్పును మరోమారు సర్దుకుంది. కుచాలపై హత్తిన కుంకంలో చిరుచెమటకు తడిసిన ముత్యాలహారాన్ని పైకెత్తి ఒక్కొక్క పూసనూ గోళ్ళతో గీరింది. పూలపుప్పొడి పయ్యెదమీద పడిందన్న నెపముతో, దానిని ఎత్తి, దులిపి, మళ్ళి సవరించుకొంది. తన కోసం వెతుకుతూ వచ్చిన స్నేహితురాళ్ళను రావద్దని బొమముడితోసంజ్ఞ చేసింది. మాటిమాటికి వెనుదిరిగి చూసింది. మనస్సులో పుట్టే భయాన్ని నిరోధించుకుంటూ ప్రవరుడికి మరింత దగ్గరగా నడిచింది.

'ఓయి ప్రవరుడా! ఎందులో మనస్సు, ఇంద్రియాలు వికసించి, విశ్రాంతి పొందుతాయో, ఎందులో మనస్సు చలించకుండా సుఖిస్తుందో- అట్టి సర్వేంద్రియాలు లయించే ఆనందమే పరబ్రహ్మమని తెలుసుకో, 'ఆనందోబ్రహ్మ'యని వేదాలు చెపుతున్నాయి గదా! ఆ వేదార్థాన్ని

నీ బుద్ధిపెట్టుకు ఆలోచించు' అన్నది వరూధిని. ఆ బ్రహ్మానందం సంభోగంలోనే ఉన్నదని ప్రవరునికి సూచించింది.

ఎలాగైనా తనను ఒడబరచాలని ఆ అమరకాంత పడే తత్తరాన్ని చూసి ప్రవరుడు మనస్సులో సిగ్గుపడ్డాడు; అసహ్యించు కున్నాడు. నిస్పృహను తెలిపే చిన్న చిరునవ్వు నవ్వాడు. నవ్వుతూ అన్నాడు

'ఈ పాండిత్యం నీకు తప్ప ఇంకెక్కడా చూడలేదు. కామశాస్త్రోపా ధ్యాయిని లాగ చెపుతున్నావు. బాగుంది. వేదవిద్యలన్నీ పాపాలు, రతి పుణ్యమూ అంటున్నావు. ఇంకెందుకులే తర్కం! మోక్షలక్ష్మీ పథానికి అనుకూలమైన ఆగమసూత్రాల పంక్తికి మీరు చెప్పే సంప్ర దాయార్థాలివే కాబోలు!' అని ఈసడించాడు ప్రవరుడు.

"తరుణీ! రాత్రింబవళ్ళు మేమిచ్చే హవ్యాలతో తృప్తిపడి అగ్ని మాకిచ్చే స్వర్గసుఖాలు నీకేం తెలుసు? నాకు అరణులు, దర్భలు, అగ్నులు ప్రియమైనట్లు ఇంకేవీ కావు. ఈ శరీరంతోనే స్వర్గసుఖాలను పొందమన్నావే! ఈ శరీరం స్థిరం కాదు గదా! అస్థిరమైన తుచ్ఛశరీరంవల్ల కలిగే సుఖాలు కూడా అల్పమైనవి. మీసాలకంటుకున్న తేనెలాంటివి ! అన్నాడాయన!

ఆ మాట ఏంటూనే వరూధిని నోటమాటలేకుండా పోయింది. ఆమె హృదయం కృంగిపోయింది; ముఖం పాలిపోయింది; కళ్ళల్లో నీళ్ళు చిమ్మాయి. తెల్లబోయి కళ్ళనీళ్ళను ఆపుకుని, ఆపుకుని అతన్ని చూసింది. తలయూచింది. కంఠం గద్గదికమై పోయింది.

"అయ్యో! వనిత తనంతతావలచి వచ్చిన నీ చుల్కన కాదె ఏరికిన్ !' అని ఏడ్చింది.

'నన్నింక యేడిపించకయ్యా!' అంటూ ఒక్కసారిగా ఆ దేవతా స్త్రీ రతి సంరంభంలో కోకముడివిడిపోగా, నిట్టూర్పులు నిగుడిస్తూ, కొప్పుజారిపోగా, పూలు రాలిపోగా శరీరం గగుర్పొడవగా, ప్రార్థనా పూర్వకంగా ఒక్క ఉదుటులో వెళ్ళి ప్రవరుని మీద పడింది.

మెడలో ధరించిన నగలతో సమానంగా ఆమె చంకలు కూడా మెరుస్తూండగా, పాలిండ్లు ఉప్పొంగి పోగా, చనుమొనలు ఆనునట్లుగా ఆ ప్రవరుణ్ణి గట్టిగా హత్తుకొని, ముద్దు పెట్టుకోబోయింది పరూధిని.

ఆ బ్రాహ్మణుడు "శ్రీహరీ" అంటూ ముఖం ప్రక్కకు త్రిప్పుకుని, ఆవిడ రెండు భుజాలనూ తన చేతులతో నొక్కిపట్టి "ఫో" అంటూ ఒక్క ఊపుతో త్రోసివేశాడు. 'కలంచునే సతులమాయలో ధీరచిత్తంబులన్!'

ఆ త్రోపుకు తొట్రుపడి కష్టంమీద నిలబడింది పరూధిని. సిగ్గుతో కుమిలిపోయింది, కొప్పు సవరించుకుంది. తన అందచందాలన్నీ ప్రవరుడి కళ్ళపడేలా ప్రదర్శించి కోపంతో చుర చురా చూస్తూ గొంతు సవరించుకుంది.

'నీకు దయాదాక్షిణ్యాలున్నట్లు లేదు. ఆడదాన్ని ఇలా పడ త్రోయవచ్చా? నువ్వు త్రోసెయ్యగా నీ గోరు యెక్కడ గ్రుచ్చుకుందో చూడు; అంటూ తన స్తనాన్ని ఎత్తి చూపించి, గోటితో మీటితే చాలు పగులుతాయా అన్నంత బిగ్గుగా ఉన్న ఆమె గుండ్రని చనుమిట్టల మీద కన్నీరు రాలిపడుతూండగా సన్నని మధురకంఠంతో పరూధిని ఏడ్చింది. ఆమె తామర రేకుల్లాంటి కళ్ళల్లో ప్రస్ఫుటంగా కనిపించే ధవళకాంతులన్నీ ఆమె యేడ్పుకు ఎర్రబడ్డాయి.

నిశ్చేష్టుడైపోయాడు బ్రాహ్మణుడు.

"యజ్ఞాలు చేశానన్నావు, తపస్సు చేశానన్నావు. దయ లేనివాడు ఏంచేస్తే పుణ్యాలు లభిస్తాయి? భూతదయగలవాడు ఏ పు ణ్యమూ చెయ్యకపోయినా సద్గతిని పొందుతాడు. ఆపాటి కూడా తెలియని నీ చదువెందుకు చెప్పు!

"దాశరాజకూతురు మత్స్యగంధి జాలరి గదా! అని, దానితో రతికేళి చేసిన పరాశరుణ్ణి మీ బ్రాహ్మణులు వెలేశారా?

"విశ్వామిత్రుడికి మేనకతో లభించిన చుట్టరికం వలన కులంలో ఆయనకు వన్నె తక్కువైందా?"

"మందకర్ణి ఐదుగురు అప్సరసల్ని స్వీకరించి, యోజన విస్తీర్ణమగు సరస్సులో సౌధంకట్టుకుని కులికినంత మాత్రాన ఉన్న మహిమ లేకుండా పోయిందా?

"అహల్యా జారుడైనంతలో ఇంద్రుణ్ణి స్వర్గరాజ్యాన్ని ఏలుకో నివ్వమని దేవతలెవరైనా నిరోధించారా?

"అంతకన్నా గొప్పదా, నీమహత్యం? నీళ్ళూ, ఆకులూ, గాలీ తిని బ్రతుకుతూ, ఇనపకచ్చడాలు కట్టుకున్న మునిముచ్చులంతా అందగత్తెల కౌగిళ్ళలో బందీలు కావటం లేదా?" అని ఆక్రోశించింది వరూధిని.

ప్రవరుడు పెదవివిప్పి జవాబు చెప్పలేదు. కన్నెత్తి ఆమె వైపు చూడనైనా లేదు. ఆమె తనను కావలించుకున్నప్పుడు తన వంటిని అంటుకున్న జవ్వాది పసపోవునట్లుగా శుభ్రంగా నీటితో కడుక్కున్నాడు.

ఆ వెంటనే కూర్చుని ఆచమనం చేసి, త్రేతాగ్నులలో ముఖ్య మైన గార్హపత్య అగ్నిని ధ్యానించి

"ఓ అగ్నిదేవతా! స్వాహా వధూపల్లభా! నీ ముఖంగా దేవతలు సంతృప్తి పడుతున్నారు. నిన్నే ఈశ్వరుడని వేదాలు స్తుతిస్తున్నాయి. సమస్త జగత్తులోనూ నువ్వు అంతర్యామివై ఉన్నావు. ఆహవనీయాగ్ని, దక్షిణాగ్ని నీలోనే పుడుతున్నాయి. ఓ మహాత్మా నన్ను కాపాడు.

'ఓ హవ్యవాహనా! త్యాగంలో, జపంలో, అగ్నిహోత్రంలోనేను నిస్వార్థపరుడనైతే నీ పాదపద్మాలను నిత్యం ధ్యానించటమే జీవితంగా గలవాడినైతే, ఇతరుల భార్యల్ని, ఇతరుల ధనాన్ని ఆశించని వాడినైతే సూర్యుడు పశ్చిమ సముద్రంలో మునగకముందే నన్ను సగౌరవంగా నా ఇంట్లో ఉండేటట్లు చెయ్యి' అంటూ కళ్ళు మూసుకున్నాడు.

ఈ విధంగా ఆయన ప్రార్థించటంతో అగ్నిదేవుడు ఆ అదృష్టవంతుని శరీరంలో ప్రవేశించాడు. ఆయన శరీరం సూర్యోదయ కాలంలో ఉదయపర్వతంలా ప్రకాశించింది. పుటంవేసి కరిగిన బంగారం నీరులా వెలిగే ఆయన శరీరకాంతికి ఆ అడవి అంతా ఒక్కవెలుగు వెలిగింది. ఆ ప్రవరుని తేజస్సును చూస్తున్నకొద్దీ ఆ వరూధిని హృదయ కమలంలో చిప్పిలుతున్న అనురాగరసం మకరందం పలె పొంగిపోయింది. ఒక్కక్షణంలో వాయువేగంతో ఆ ప్రవరుడు ఇంటికెగిరిపోతున్నాడు. అతను వెళ్ళటం ఇష్టంలేని వరూధిని కుంచించుకుపోయింది. మూర్ఛపోయింది.

ఆ ప్రవరుడలా ఆమెను నిరాకరించిపోయినా ఆమె అతని చక్కదనాన్నే మనస్సులో తలచుకుంటూ దుఃఖం భరించలేక వున్నచోట నిలబడలేక, యేదో ఆశకొద్దీ, ఆ కొండనడిమి ప్రదేశాలన్నిటి యందూ, అన్ని త్రోవలంటా తిరగబొచ్చింది.

తిరిగి తిరిగి ఆ బ్రాహ్మణుడు వెళ్ళిన జాడను వెదకి వెదకి

అలిసిపోయిన సమయంలో ఆమె చెలికత్తెలు ఆమెను వెతుక్కుంటూ వచ్చి బ్రతిమాలుతూ ఇంటికి తీసుకుపోయారు.'

'వాడు నా ప్రేమను వ్యర్థంచేసి, నిర్దయుడై నన్ను త్రోసుకు పోయాడు. ఈ వియోగదుఃఖ సముద్రాన్ని నేనెలా దాటగలను? నే నంత నేచుకోలేదా? నేనెక్కడ? వానికొగిలి యెక్కడ? యెన్నో గొప్పనోము లు నోచితే గాని అది లభించదు కాబోలు; హా విధీ! యేం చెయ్యను?

ఔరా, కొంచమైనా కందని అతని శరీరం మేలిమి బంగారమే. అతని బారెడు జుట్టుచూసి తుమ్మెదలు దిమ్మెరపోవలసిందే. చంద్ర బింబాన్ని నోరెత్తనివ్వని ముఖబింబం అతనిది; అతని భుజశిరస్సులు కొండ శిఖరాలవలె ఉన్నాయి. నడుము ఉందా అతనికి? వాని కళ్ళు ఎంతవిశాలంగా ఉన్నాయి!

వయస్సూ, వయస్సుకు తగ్గ అందమూ గల ప్రియుడుతనను కౌగిట్లో బిగియపట్టి తనలోకి చొచ్చుకుపోతూ, పదేపదే రమించే అదృ ష్టానికి నోచుకోని స్త్రీ సొగసెందుకు? యవ్వనం ఎందుకు? ప్రాణ మెందుకు?

"ఆ మర్త్య భూమినులు ఎంత తపస్సుచేసి పుట్టారో! ప్రియుడు తృణీకరిస్తే శరీరాన్ని ఇట్టే త్యజిస్తారు. నేను చావులేని దేవతనై ఈ చింతలలో, వంతలలో చివికి, కృశించి సిగ్గులేని దాన్ని అయ్యాను. చావులేని నా సౌందర్యం ఈనాడు పాడుబడ్డ కొంపలో పెట్టిన దీపంలా ఉంది."

ఈరకంగా వరూధిని పెక్కువిధాల భావిస్తూ, తన గాంభీర్యాన్ని పోగొట్టుకుని, క్రమంగా పెరిగే దావాగ్నిలాంటి విరహంతో వణుకుతూ, ధైర్యంచెడి, తాపంతో ఉస్సురని అంటున్నది, ఆ గాడ్పులనుంచి

దుఃఖపు తెరలు వచ్చినప్పుడు పైటచెంగుతో తుడిచినా అణగవు. ఆమె కాటుకతో కలిసి నల్లనైన కన్నీరు యెఱ్ఱని కనుకొలకుల నుంచి దిగజారి ఆమె చెవిరంధ్రాలను నింపుతున్నది. అక్కడే ఉన్న చెవి కమ్మలు ఆమెవంటి వేడికి అప్పటికే కాలివుండటంతో, ఈ కన్నీరు పడిపొగలు క్రక్కుతున్నాయి.

తామరతూడులాంటి ఆమె సుకుమారమైన అరచేతిలో కొప్పు పెట్టుకుని ఇటూ అటూ దొర్లుతోంది; ఆ కొప్పువిచ్చి, సుగ్గులుదేరిన తలవెంట్రుకల మధ్య పువ్వులు చెదరి కనిపిస్తున్నాయి. అప్పుడాకొప్పు వెంట్రుకల రాశి ఆమె శరీరాన్ని కమ్ముకోగా నక్షత్రాలతో మెరుస్తున్న ఆకాశమే ఎరిగి మీద పడ్డట్టుగా కనిపించింది.

ఆమె శరీరం పులకించగా మొలకెత్తిన రోమాలను, మడుగులుకట్టిన చెమటలు తడువుతున్నాయి. అప్పుడు బైటపడ్డ ఆమె చనుదోయి గంగానదిలో ఈదుటకు అనువుగా బోర్లవేసిన పెద్ద కుండలవలె వెల్లనయి మెరుగులీనుతోంది.

పూచిన పొదరిళ్ళ క్రింద, చంద్రకాంత శిలావేదికపై పడుకుని యేడ్చుచున్న ఆ వరూధిని, ముక్కంటి కంటిమంటకు భస్మమైన మన్మథుని తలంచుకుని, చంద్రుని పట్టుకు తిట్టే రతీదేవిలా ఉంది.

ఆ లేత వయస్సుదాన్ని, వేరొకనియందు మనసులేనిదాన్ని, అతి దారుణమయిన మన్మథ తాపానికి ఎవశురాలిని చేసి, క్రూరుడయి బ్రాహ్మణాధముడు పొగరుతో వెళ్ళి పోయాడన్న భావంతో రోషభీషణ స్ఫురణను వహించినట్లుగా సూర్యుడు ఎర్రబారి అస్తగిరి చేరాడు.

ఆ హిమగిరిమీద పరుచుకున్న ఎర్రనియెండ మోదుగు పువ్వులు పరిచినట్లుంది. పగడాలు పరచినట్లుంది. అందాకా కొండ

గుహలలో నిద్రించి లేచిన పెద్దపులులు ఎండకు ఎర్రనయిన సెలయేటినీళ్ళను రక్తమనుకుని త్రాగుతున్నాయి. పొదలనడుమ పచ్చికమేస్తున్న లేళ్ళు ఆ ఎర్రని ఎండను దావాగ్నిగా భ్రమించి, పణికి పోతున్నాయి. మునిపల్లెలో చెట్లకొసలందు ఆరబెట్టిన కాషాయ వస్త్రాలవలె ఎండలు భ్రమ గొల్పుతున్నాయి. హిమాద్రిపై ఎండపడటం పలన మేరుపర్వతంలా కనిపించి దేవతలు దిగివస్తున్నారు.

మేతకు పోయిన పక్షులు ఆకాశంలో తోరణాలుకట్టి తిరిగి వస్తున్నాయి. సూర్యకాంతపురాళ్ళు అంత వరకూ మంటలు క్రక్కిన వల్లా ఇప్పుడు గోరువెచ్చగా మారుతున్నాయి. సూర్యబింబం యెర్ర బడింది. దిక్కులలో వెలుగులు తగ్గుతున్నాయి. తామరగుంపులు ముడుచుకు పోతున్నాయి.

"ఇదిగో సూర్యుడు కృంగిపోతున్నాడు. రా" అని చంద్రుని పిలవటానికి వెడుతున్న రజనీదేవి చెలికత్తెలవలె పొడవయిన నీడలు తూర్పుకు పరుగెడుతున్నాయి.

కమలానికి బంధువు పడమటి సముద్రంలో కృంగిపోయాడు. ఆ సముద్రంలో ఆ సూర్యుని అశ్వాలు ఏ ఆడగుర్రాల ముఖంచూశాయో గాని, తమకం ఆపుకోలేక సూర్యునిరథాన్ని ఈడ్చుకుంటూ ఆ సముద్రంలోకి దూకినట్టే కనిపిస్తోంది.

పాపం ఒక చక్రవాకి-అబల-తన ప్రియుణ్ణి ఎడబాసి, దుఃఖంతో ఆ ఇసుక తిన్నెల్లో ఏ పక్షి కనబడ్డా తన మగడేమో అనుకుని కూసుకుంటూ దగ్గరికి పోతోంది. తీరా అది తన మగడు కాకపోవటంతో మళ్ళీ మెడ ఎత్తి ఆకాశంలోకి కలయచూస్తున్నది. ఎటూ ఆప్రియుడు కనబడకపోవటంతో కన్నీటితో తిరిగి వస్తున్నది. తిరిగి తిరిగి నోరు

ఎండిపోగా తామరపువ్వుమీద విరహాకాంతవలె వ్రాలి తన ముక్కును నీటితో అద్దుకుంటున్నది. విరహార్తులకు నీళ్ళు కూడా సాయించవు గదా! అటూ ఇటూ చూసి, నీటిలో కనబడే తనసీడయే తన ప్రియుడే మోనన్న భ్రమకలుగగా ఆ నీటిలోకి ఉరుకుతోంది. అలాదూకి రెక్కలు తడిసిపోవటంతో మరో తామరపువ్వు పైకి పోతోంది. ఆ పువ్వులతో రాచక్రీడలను జరుపుకునే తుమ్మెదల్ని చూసి, అసూయతో తన ముక్కుతో ఒకపోటు పొడుస్తున్నది. అవి జుమ్మని ఎగురుతుంటే మనస్సు ఉండబట్టక మళ్ళీ తన ప్రియుని కోసం రెక్కలార్చి ఎగురుతున్నది.

సముద్రగర్భంలోకి సూర్యబింబం జారిపడినందుపలన బుసకొడుతూ ఆకాశంలోకి పరుగెత్తిన ఆదిశేషువు శిరస్సులోని రతనాలకాంతివలె ఆకాశం మెరుస్తోంది. పడమటికొండ కొనలందు వెలిగే జ్యోతిర్లతల వెలుగుతో మెరుస్తోంది ఆకాశం. సూర్యునిరథం యొక్క కాడిదెబ్బకు బ్రద్దలయిన బ్రహ్మాండమనే గంగాళపు దిక్కులలో వ్యాపించిన బంగారు కాంతిలా మెరుస్తోంది ఆకాశం. శివుడు తాండవం చేస్తుండగా రాత్రి అనే స్త్రీ చేతితో దివిటీ పట్టుకున్నట్లు ఉంది ఆకాశం. పడమటి దిగ్గజానికి మదం అధికమయిపోగా దానిదాహశాంతి కోసం వరుణుడనే మావటీడు పరచిన ఎర్రమట్టి పరుపులా ఉంది ఆకాశం.

నీళ్ళల్లో తేలుతున్న ఈ బ్రహ్మాండం ఎండతగలక అందం చెడిపోయి నల్లబడిందన్నట్లు చిక్కని చీకట్లు వ్యాపించాయి.

ఆరాత్రి చీకటి వళ్ళంతా కస్తూరి అలముకుని బోయెదాని వేషంలో బయలు దేరిన పార్వతిలా ఉంది; నెమలిపింఛాన్ని ధరించిన శ్రీకృష్ణుడిలా ఉంది– నల్లహంసలతో నిండిన కాళిందిలా ఉంది; చీకటి

చెట్లతో నిండిన కాటుకకొండలా ఉంది. ఏనుగుల మందలా వర్ష పయోదాలు ఒకదానినొకటి క్రుమ్ముకుంటూ గగనతలాన్ని కప్పినట్టుగా ఉంది.

తన చెలికత్తెయగు నిశకు ప్రియుడగు చంద్రుడు వస్తున్నాడని ప్రాచి (తూర్పుదిక్కు) అను స్త్రీ గ్రహించింది. గబగబా తనముఖాన చిమ్ముకున్న చీకట్లనే తలవెంట్రుకలను దువ్వుకోటానికి దంతపు దువ్వెన ఎత్తినట్లుగా తూర్పుదిక్కున వెలుగులు కననయ్యాయి.

చంద్రుడుదయించాడు. తామరపువ్వులకతని వెన్నెల, మంటల్ని రగిలించింది. పచ్చనిపైరేకులు మాడిపోతున్నాయి. తుమ్మెదలు ఆతామర పువ్వులనుంచి చిమచిమ ధ్వనులతో పైకివస్తూపొగల వలె కనిపిస్తున్నాయి.

ఉదయించిన చంద్రుడిని చూసి, కలువలు వికసించాయి. చంద్రకాంతపురాళ్ళు ద్రవించాయి. చకోరాలు సంభోగసుఖంలో ఓలలాడాయి. సముద్రం ఉప్పొంగింది. దిక్కులన్నీ తెల్లమొగం వేసుకుని చూస్తున్నాయి. చక్రవాకాలు విరహతాపంతో తామర జొంపాలలో దాంకొంటున్నాయి. స్త్రీ పురుషులు ప్రణయకలహాలను విడిచిపెట్టారు. మన్మథుడు తన బాణాలకు పదునుపెడుతున్నాడు. మంచు యెక్కువగా పడుతోంది. వెన్నెలచే విరహం ఎక్కువయిన స్త్రీలు పరితపిస్తున్నారు. జారులు, చోరులు తిరగటం మానుకున్నారు. పగలు కాసిన ఎండకు వేడెక్కిన భూమి వెన్నెలలో ఒళ్ళుచల్లబరుచుకుంటోంది. నక్షత్రాలు తెల్లబోతున్నాయి.

మొదట్లో చంద్రుడు ఉదయపర్వత సాహచర్యంలో ఎర్రగా కనబడ్డాడు. రాను రాను తెల్లబడ్డాడు. దుష్టుల సాహచర్యంలో ఉన్న

ప్పుడు మంచివాడు కూడా చెడ్డవాడిలా ప్రవర్తించినా ఆ సాహచర్యం తొలగిపోగానే మళ్ళీ మంచివాడు కాకమానడు.

కాలమనే వైద్యుడు స్త్రీ పురుషుల కామేచ్ఛను నిలబెట్టటం కోసం మూలికారసాన్నీ, పాదరసాన్నీ కలిపి తయారుచేసిన రసగుళికలా కనిపిస్తున్నాడు చంద్రుడు.

బలవంతుడయిన చంద్రుడు తరుముకొస్తుండగా భయపడి సూర్యుడు పారిపోతే ఆయన భార్య ఛాయాదేవిని చంద్రుడు తనపరిష్వంగంలో చేర్చుకున్నట్లుగా చంద్రునిలోని మచ్చ కనిపిస్తోంది.

లోకంలో ఉన్ననల్లనివాటినల్లా తెల్లగా చేస్తున్న వెన్నెల చెట్ల నీడల్ని తెల్లగా చేయలేకపోయినందుకు యేడుస్తున్నట్లుగా మంచు బిందువులు కురుస్తూ ఉన్నాయి.

ఆ వెన్నెలకు తళతళా మెరిసిపోతున్న నీటిలో లక్ష్మీదేవికి పుట్టినిల్లయిన పాలసముద్రం కనిపించింది.

చంద్రుడుతప్ప మరోగ్రహమేదీ కనబడకుండా ఆకాశాన్ని ఒకే తెల్లని రంగు ఆక్రమించింది.

చకోరపక్షుల ముగ్గలోకి ఎక్కని వెన్నెల ముక్కులలోకి దూరటం ఆశ్చర్యంగా ఉంది.

బొండుమల్లెల పరాగాన్ని అనుభవించే తుమ్మెదలు ఆ వెన్నెల్లో మిణుగురు పురుగులవలె కనిపిస్తున్నాయి.

చంద్రకాంతపురాళ్ళు కరిగి యేర్పడిన నీటి ఊటలతో నల్లకలువతేనె మిళితమయి చల్లని మంచుతో కూడి జిగట కాల్వలు ప్రవహిస్తున్నాయి.

పిల్లకాలువలు చెట్లవరుసల్ని సోకి అల్లలాడించగా ఆ ఆకుల

మీద వెన్నెల తరంగాలు ప్రవహిస్తున్నాయి.

వెన్నెల వెలుగులలో పుయ్యని చెట్లు కూడా పూసినట్లుగా భ్రమింపచేస్తున్నాయి.

వెన్నెల కూడా ఎండమావుల్ని సృష్టించిందా అన్నట్టు దిక్కుల గోడలు తమ సహజమయిన నల్లదనాన్ని విడిచి తెల్లబడ్డాయి.

పర్యాచకానికై పెడమొగం పెట్టుకుని దాంకుంటున్న ప్రియురాల్ని, కాలి అందెల ధ్వనులు వినరాగా, కొప్పులు జారి పోగా, నిట్టూర్పు గాడ్పులకు పమిటలు జారిపోగా అందీ అందని విధంగా పట్టుకుని, కౌగిట్లో పెట్టుకుని, ప్రేమలొలికేలా మాట్లాడుతూ ముద్దు పెట్టుకునే ఒయ్యారుల పలువరుస కాంతులు ఈ వెన్నెలను మరీ తెల్లగా చేస్తున్నాయి.

ప్రణయకోపాలతో తలవంచుకుని చప్పుడు కాకుండా దొంగ యేడ్పులు యేడ్చే ప్రియురాళ్ళను చేరి ప్రియులు ఊరడిస్తున్నారు. వారు వంచిన తలల్ని చెక్కిళ్ళపై గోళ్ళుంచి పైకెత్తుతున్నారు. ముక్కర ముత్యాల వంటి కన్నీటి బొట్లను చూచి, కోపం పోయిందా? నవ్వుతున్నావా? అని పరిహాసం చేస్తున్నారు. ఆ ప్రియురాళ్ళచే అరచేతి దెబ్బలు తింటూ మొగాలు తెల్లవేస్తున్నారు. ఆ మొగాల తెల్లదనం కూడా ఈ వెన్నెలలో కనిపిస్తోంది.

పిండి చల్లినట్లున్న వెన్నెలలో తమ అందాలను ప్రియులకు అందివ్వలేని నంగనాచుల్ని ప్రియులు లాలనతో పొదరిళ్ళను చేర్చి క్రీడిస్తున్నారు. ఆ చీకట్లో చనువిచ్చే ప్రియురాళ్ళ అవయవాలపస బయటపడేలా వెన్నెల ఆ చెట్లచిగుళ్ళ సందులలో దూరి అక్కడి చీకట్లను తొలగిస్తోంది.

ఆ పాదరిళ్లలో ఉపరతి జరిపి, అలసి, చెమర్చిన ప్రియురాళ్ళ చిరు చెమట బిందువులలో వెన్నెల కరిగి చిట్లిన మంచి గంధంలా ఉంది.

వెన్నెలలో చేరవలసినచోటికి కొంచెం ముందు గానే చెట్ల నీడలలో దాంకుని మేలిముసుగుధరించి వెడుతున్న తమ ప్రియురాళ్ళను అల్లరి పెట్టే తమకంతో ఆ ముసుగుల్ని ప్రియులు ఊడలాగినప్పుడు ముందుగా భయంతోనూ, తర్వాత ఆశ్చర్యంతోనూ నవ్వుతూ చూసే కన్నుల తెల్లదనం వెన్నెలలో కరిగి పోయింది.

చంద్రోదయంతో హెచ్చిన మన్మథవికారానికి తోడుగా కొంత మంది మగువలు మద్యాన్ని పుక్కిట పెట్టుకుని వస్తూండగా విప్పపువ్వు మొగ్గలాంటి వారి బుగ్గలకు ఇటూ అటూ దివిటీవెలిగే చెవికమ్మల వజ్రాల కాంతులు ఆ వెన్నెలలో కరగిపోతున్నాయి.

సంభోగం అయిపోయిన తర్వాత అలసట తీరటం కోసం తమ ఇళ్ళముందటి పెరళ్ళలో స్త్రీలు నిలబడి జుట్టుసరి చేసుకుంటున్నారు. రతి క్రీడ జరిగినప్పుడు ఆ స్త్రీలన్న మాటలన్నీ ప్రియులు జ్ఞాపకం చేస్తున్నారు. దానితో సిగ్గుపడి ఆ స్త్రీలు నవ్వుతూ తమ ప్రియుల్ని తమ చేతులితోవిసరి కొడుతున్నారు. అప్పటి వారి చేతి కంకణాల రత్న కాంతులు కూడా ఈ వెన్నెలలో కరిగిపోయాయి.

అంత చక్కని వెన్నెల్లో ధైర్యం చెదరి, హృదయం పరితపిస్తూవుండగా చిగురుటాకుపాన్పును కూడా భరించలేక లేచి కూర్చుని, కారు కన్నీటిని గోరుతో మీటుకుంటూ పరూధిని తన చెలికత్తెలతో అంది.

"నేములు నేచిననమ్మలు తమ కోరికలు తీరేటట్లుగా తమ

ప్రాణనాయకులతో కలిసి ఇక్కడ విహరిస్తున్నారు. వారి మధ్య ఏడుస్తూ నేనుండలేను. పూదోటలోకి పోదాం పద–"

అని చెప్పి పాన్పు మీంచిదిగి, చంద్రతాపాన్ని సహించలేక పమిట కొంగు ముసుగువేసుకుని తన తోటలోకి వెళ్ళింది.

అయినా ఆమెకు విరహాగ్ని దహిస్తూనే ఉంది. ఆ బాధకు తాళలేక, ప్రాణాలకు తెగించిన మనిషి బాణాలకు ఎదురేగినట్టు పూల పరిమళంతో మత్తెక్కిన గాలిలో పమిట జారిపోయేటట్టుగా పరుగెట్టింది. దావాగ్నిలో దూకుతున్నట్టుగా ఎర్రని చిగురుటాకుల పొదలలో కొప్పుముడి జారిపోయేలా దూకింది. చిరుగాజుల్ని వైకి తోసుకుని, గొంతుకకు ఉరిపోసుకునే దానిలా నున్నని తీగను పట్టి లాగింది. యేటిలో ఉరికే దానిలా మొలనూలును గట్టిగా బిగించి, తెల్లని వెన్నెలలోకి దూకింది. తుమ్మెదలకు జడవక యెదురు నిలిచింది. పూలపరాగంలో మునిగింది. పూచిన మామిళ్ళ నీడను నిలచింది. పూలపరిమళాన్ని విషం తాగినట్టుగా తాగింది.

ఈ విధంగా హెచ్చిన మదన తాపంతో చావటానికి ఉద్యుక్తు రాలయిన వరూధిని పట్టుకుని చెలికత్తెలంతా "వెర్రిదానా, ఇలాంటి సాహసాలు చేయటం న్యాయమేనా?" అని మందలించారు. ఆమె చెక్కిళ్ళ జారిన కన్నీరు ఆగి పోయే వరకు కొంగులతో వత్తారు.

పైపైపూత బంగారం లాంటి కపట ప్రేమలను నటించే మనజాతికే నీ నిజమయిన ప్రేమ చులకనకదటమ్మా! నీ ప్రగాఢ ప్రేమ సంగతి తెలిస్తే సురాంగనలు మెచ్చుకుంటారా? నిర్దయగా నీ బంగారం లాంటి శరీరాన్ని వెన్నెల్లో వేయిస్తావా? ఆడదానికింత కనువేదురు (Love at first sight) తగునా?

"ఇంటి దగ్గర చందు్రని తాపాన్ని సహించలేక మన్మధసేనలన్నీ గుమిగూడి దహించే యీ శృంగారవనానికి వచ్చావా? ఇక్కడ తాపం తగ్గుతుందటే. ముల్లు గుచ్చుకున్న చోటు ఆ ముల్లు తీసి కొరు్ర దిగగొట్టినట్టుంది! చాలు చాలు- ఈ ఉద్యానవనాన్ని విడిచి ఇంటికి పోదాం పద-" అంటూ ఒప్పించి చెలికత్తెలు వరూధినిని తీసుకొస్తున్నారు. ఆ పెద్ద చన్నుల వరూధిని కనికరం లేకుండా ఆకాశంలో కనకనవెలుగుతున్న చందు్రణ్ణి కని మిక్కిలి కోపంతో

"ఓ చందా్ర! ప్రియవియోగంతో దుఃఖించే స్త్రీలను చంపటంలో నీవు నేర్పరివి. యెన్ని హత్యలు చేశావో. నువ్వు రాజువనిపించుకోవటానికి. గురువు గారి భార్యనే అపహరించిన నీచుడివి. నీకు ఆపాటి వివేకం ఉంటే గదా!

"ఆ సూర్యుని కిరణాలే లేకుంటే నీకు రూపమేలేదని మరిచిపోకు. దక్షుని యజ్ఞాన్ని ధ్వంసం చేసిన వీరభదు్రడి పాదాల క్రిందపడి నలిగిపోయిన సంగతిని మరచిపోకు. నీ శరీరం నిండా బోలెడు కళంకం ఉన్నదని మరచిపోకు. ఒక్కొక్క రోజు ఉదయించే భాగ్యం నీకు లేదని మరచిపోకు. నిన్ను నిత్యమూ క్షయరోగం పీడిస్తోందని మరచిపోకు. నీకు శరీరమంతటా పాండువ్యాధి ఉన్నందునే తెల్లగా ఉన్నావని మరచిపోకు. యెన్నో నక్షత్రాలు నిన్ను వరించాయనికూడా మరచిపోకు. ప్రాణిలోకాన్ని బాధించటంలో రాజువయిన నీకూ ఆ యమధర్మరాజుకీ తేడా ఏమిటి? నీకంటే ఆ పుణ్యాత్ముడికి ధర్మమన్న శబ్దమయినా ఎక్కువగా ఉంది! నీకు ధర్మాధర్మాల జ్ఞానం కూడా ఉన్నట్లు లేదు.

"ఓ చందా్ర! నువ్వు ముల్లోకాలనూ బాధిస్తావు. గనుకనేపాతాళ

లోకంలో రాహువు, భూలోకంలో చకోరాలు, స్వర్గంలో దేవతలూ నిన్ను తింటున్నారు."

"ఎంతమంది నిన్ను తిన్నా బ్రతికి ఉండే విద్యని వాతాపి దగ్గరనేర్చుకున్నావా ఏమి? ఆయువు పుంది గనుక బ్రతుకుతున్నారు గాని, నిన్ను తిన్నందుకు దేవతలు కూడా చావవలసిన వాళ్ళే."

"నిన్ను కట్టుకుని నీకోసం పరితపించే రోహిణిని ఒక్క రోజు కూడానువ్వు సుఖపెట్టలేదు. త్రిపుర సంహారం చేసినప్పుడుశివుడు నీ శరీరానికి కన్నం పెట్టి రధ చక్రంగా చేసుకున్నాడని విన్నాం. ఆడ దాని ఉసురుతగిలి నీ శరీరంలో సెలవేసి చావనైనా చచ్చావు కాదు!"

"ఓ పద్మాలకు శత్రువా! పాలల్లో పుడితే మాత్రం మేలు గుణం కలుగుతుందా? నీళ్ళల్లో పుట్టిన వాడే గదా అగ్ని, జగమెల్లా కాలుస్తున్నాడు?"

"తెలియక శివుడు నిన్ను కొన్నాళ్ళు తలపై పెట్టుకున్నాడు. నీ కళంకం తెలిసి దక్షయజ్ఞంలో నిన్ను కాలి క్రిందపడేసి తొక్కలేదా? అయినా సిగ్గులేక ఇంకా బ్రతికున్నావా?"

"క్రూరుడివి కనుకనే నీ చేతి గాండీవాన్ని లాక్కుని చెఱుకుగెడ అందించారు. గాండీవమే ఉంటే నీ కౌర్యానికి హద్దులు ఉండునా?" అని చందురిణ్ణి తిట్టిపోసింది. చందురినితో బాటు అతని మేనల్లుడు మన్మథుడు జ్ఞాపకం వచ్చాడు వరూధినికి.

శివుని తపోభంగం చెయ్యాలని మన్మథుడు ప్రయత్నించిన రోజున మన్మథుడు ఏమయ్యాడు? ఆయన కంటి మంటలకుమండి పోయి బూడిదయ్యాడు. పతి వియోగానికి రతీదేవి ఘోరంగావిడ్రింది కనుక జాలిపడి దేవతలు శివుని ప్రార్థించారు. అప్పుడు శివుడు

కరుణించి మన్మథుని శరీరహీనుడిగా జీవించమని అనుగ్రహించాడు. రతీదేవి కన్నులనుంచి జాలువారిన కన్నీటితో తడియుట వల్లనే ఆ బూడిద నుంచి మన్మథుడు తాను చిగురించానని మరచి, విరహిణీ స్త్రీలని కాల్చుకు తినటం ఏం బాగుంది?

బహుశా ఒకటయి ఉంటుంది. పాపం శివుడు నిన్ను కాల్చటం కోసం మూడవ కన్ను తెరిచి అగ్నిని కురిపించాడు కదా! ఆ అగ్ని కూడా స్వాహాదేవి యందు కామార్తుడయి ఉండటం వల్ల మొహమాటపడి నిన్ను సరిగా కాల్చి ఉండడు. కాకపోతే నువ్వు మళ్ళీ శరీరంతో ఉండటం ఎట్లాసాధ్యమవుతుంది? దేవుడు కూడా దోషులకే సహాయపడతాడులా ఉంది.

ప్రపంచంలోని అందాలన్నీ మూర్తీభవించిన పుణ్యాత్ముడివి నువ్వు.పువ్వులే విల్లుగా గలవాడివి. రతీ దేవి పయ్యెదకు ప్రియమైన చేతులు నీవి. ఆడవాళ్ళ మీద ఇలా క్రూరంగా నీ బాణాలు కురిపించటం బాగుందా?

అని మన్మథుణ్ణి మందలించింది. ఇంతలోనే కమ్మనిపుప్పొడి దుమారాన్ని ఆమె మీదకు యెగదోసిన మలయపవనుడు ఎదురయితే అతని మీద ఆమెకు కోపం వచ్చింది.

ఓరిగాలిగా! ఆ చందుడితో కూడి నావంటి విరహిణులను బాధించటం నీకు న్యాయంగా ఉందా? నువ్వు నీచుడివి. అటు అగ్నితో కలిసి లోకాల్ని కాలుస్తున్నావు. ఇటు చందుడితో కలిసి విరహిజనుల్ని మాడుస్తున్నావు.

అందుకే నిన్ను తినమని పాముకు రెండు నాలుకలిచ్చాడు బ్రహ్మ. అయినా మా పాపం కొద్దీ ఆ పాములు నిన్ను పూర్తిగా తిన

లేక పోయాయి. అంటూ వరూధిని విరహతాపం భరించలేక మళ్ళీ మూర్ఛపోయింది. ఆమె చెలికత్తెలు గబగబా శైత్యోపచారాలను చేసి సేదదేర్చారు. అప్పటికి తెల్ల వారిపోయింది.

"వరూధినీ చూడవే! నీ తల వెంట్రుకలు ఎలా చెదరి పోయాయో! నీ కనుబొమల మధ్య పెట్టుకున్న మంచిగంధపు బొట్టు యెలా కరిగిపోయిందో! సూర్యకాంతికి వెర్రిమొగం వేసిన చంద్రుడిలా, చిరునవ్వు తొణకని నీ మొగం ఎలా వెలవెల పోయిందో చూడవే.

"సకుటుంబంగా పారిపోతున్న చంద్రుని వెంటతరుముతున్న సేనాపతిలాగ ఆ వేగుచుక్క యెలాపోతున్నదో నీవు చూడవే.

"అర్ధసక్తులగు ప్రజలు ధనసంపాదనకయి అదిగో బిలబిలా పోతున్నారు. రాత్రింతా ప్రణయకలహాలతో వృధాపుచ్చి తెల్ల వారిందన్న కంగారుతో ప్రేమికులు హడావిడిగా సంభోగిస్తున్నారు. ధర్మ కర్మఠులు స్నాన సంధ్యలకు సమయమయిందని తొందర పడుతున్నారు. ధర్మార్థకామాలకు వేకువ అయిందని త్రిపుట స్వరంతో పక్షి కొంపల మీద కోడికూస్తున్నది విన్నావా?

"అస్తమయ సమయంలో సూర్యుని తేజస్సు అగ్నియందు సంక్రమిస్తుందని కదా వేదం చెపుతున్నది. ఆ అగ్ని ఆ తేజస్సును దీపకళికల్లో రాత్రివేళ వెలిగించింది. మళ్ళీ సూర్యుడుదయించే సరికి భయపడి వెలవెల పోయే ఆ దీపాల నుంచి ఆ తేజస్సును తొలగించి, అగ్ని అడవాళ్ళ కాటుకకన్నుల్లో దాచినట్లుంది. అవి నిప్పు కణికల్లా ఎంత ఎర్రిగా ఉన్నాయో చూశావా? వరూధినీ, నిన్న పగటి వేళ మూడవ ఝాము కోసం నీవు నీ వీణను నాటరాగాలాపనకై సరి చేసి ఉంచావు. గాలి తాకిడికి అది ఇంకా నాటరాగాన్నే ఆలపిస్తున్నది.

ఈ ప్రాతఃకాలాన దేశాక్షిరాగాన్ని ఆలపించాలి గదా! లేచివచ్చి కాస్త సవరిద్దూ!

"నీ చిలకలకీ, గోర్వంకలకీ నువ్వు మాటలు నేర్పవలసిన సమయం అయింది. నువ్వు విరహంతో ఇలా పరాయత్త చిత్తంతో ఉండిపోతే అవి పంజరంలో అరగన్ను మూతపెట్టుకుని నీలుగుతూ, అడివి పక్షి కూతల్ని నేర్చుకుంటున్నాయి.

"చూశావా, ఇదిగో తూర్పున సూర్యుడుదయిస్తున్నాడు. అదిగో పడమట చంద్రుడు అస్తమిస్తున్నాడు. ఈ రెండు బింబాలూ కాలమనెడి జెట్టి పడమటి కొండను మూపున చేర్చి ధరించిన సంగడాల వలె ఉన్నాయి. ఒకటి పైకి లేస్తోంటే ఒకటి క్రిందకు జారిపోతున్నది.

"బాల సూర్యుని కిరణాలను వేటగానికరాలుగా భ్రమించిగూళ్ళలోని పక్షులు భయంతో కేకలేస్తూ ఎగరటం చూస్తూ ఉన్నావా?

"కొంపలు అంటుకున్నప్పుడు ఆ ఇళ్ళలోని వారు ధాన్యం బస్తాలను భుజం మీద పెట్టుకుని పారిపోతున్నట్లుగా సూర్యునికిరణాలకు కలువలు ముఖం ముడుచుకోవటంతో అందుండి పారిపోయే తుమ్మెదలు తమ భుజాలపై పచ్చని పుప్పొడిని మోసుకుపోతున్నాయి.

"ఏమిటే ఎంత చెప్పినా వినిపించుకోవు? వాడేమయినా ఇంద్రుడా, చంద్రుడా, ఉపేంద్రుడా? ఈపాటిదానికి ఇంతగా విచారం దేనికి? రా, ఆ నందన భూమిలో ఏమూలో ఉంటాడులే ఆ బాపనయ్య! నీ అందం, చందం చూస్తే యెవ్వడికి వెర్రిఎక్కదు!

"దేనికింత దురంతవేదనతో ఇలా దొర్లుతున్నావు? ఏమయినా బాగుందా? ఏమంత పని ఇది? ఆ బ్రాహ్మడు బొత్తిగా కుర్రాడు. పిరికి వాడు. అప్పటికి పైబడి జంకాడు గాని, నిన్ను మళ్ళీ చూడ

కుండా ఉండగలడా? వాడికి కాలునిలుస్తుందా? రా, రా.

అన్నారు చెలికత్తెలు. లేచి నిలబడింది వరూధిని. తామర పద్మాల నుండి జాలువారిన మకరందం కలిసిన గంగాజలాలతో ముఖం కడుక్కుంది.

పచ్చకర్పూరం కలిపిన మంచి గంధం బొట్టుపెట్టుకుంది. ఎలాగో పూలగుత్తిని కొప్పులో తురుముకుంది. రత్నపాదుకల్లో కొంచెంగా కాళ్ళు దూర్చింది. వక్కపొడి కొద్దిగా నోట్లోవేసుకుంది. తమలపాకుల్ని ఎలాగో నోటతురిమింది. చింతతో చిక్కి సగమయి యున్న వరూధిని తడబడే అడుగులతో దగ్గరలోనే ఉన్న పూలతోటకుబయలు దేరింది.

ఇదంతా రహస్యంగా పొంచి చూస్తున్న గంధర్వుడొకడు కనిపెట్టాడు. అతగాడు వరూధినిని గుర్తిగా పేరెంచి, ఆమె చేత తిరస్కరింపబడి, మనస్సు కుదురులేక పరితపిస్తున్నాడు.

'ఆడవాళ్ళది చిత్రమైన స్వభావం. ఒక్కొక్కసారి ఎంత ప్రీతి మాలినా తృణీకరిస్తారు. ఒక్కొక్కసారి గొప్పమక్కువతో ఆదరిస్తారు. అందుకే "క్షణక్షణముల్ జవరాండ్రి చిత్తములలో" అన్నాడు ఎవరు ఎసుగుకొన్నారని మన ప్రయత్నం మానకూడదు. ఎలాగో వారిమనస్సును కరిగించి వశపరచుకోవటంలోనే విజ్ఞత ఉంది. అందుకే తగిన ఇచ్చకాలు చెప్పాలి.'

అనుకున్నాడు. అనుకుని ఆ ఉద్యానవనంలో ప్రవేశించి ఒక మంచి గంధం చెట్టుక్రింద నిలబడి వేషం మార్చాడు.

అర్ధచంద్రుని లాంటి అతని ఫాలభాగం మీద గంగమట్టితో తిలకం దిద్దాడు. చెక్కుటద్దాలలో కాంతి వెల్లువలు ప్రసరింపచేసే

మణి కుండలాలను చెవులకు తగిలించాడు. బంగారపు జలతారు అంచుగల ఎర్రని ఉత్తరీయాన్ని కంఠానికి చుట్టుపెట్టాడు. నీర్కావి పింజెలపై అందంగా అమరునట్లు రత్నాలు పొదిగిన బంగారు మొలత్రాడును సవరించాడు; తెల్లతెల్లని జంధ్యాన్నీ, కాశికాముద్రగల ఉంగరాన్నీ, బ్రహ్మ తేజస్సునీ ధరించి, శాంతరసం మూర్తీభవించి నట్లుగా తయారయ్యాడు.

అటు పరూధిని చెలికత్తెలతో కలిసి, కాలిఅందెలు వినిపిస్తున్న కలహంసంధ్వనుల్ని చిమ్ముతూ నడిచి వస్తున్నది.

ఆమె స్నేహితురాళ్ళంతా చంద్రకాంతపు అరుగుమీద కూర్చున్నారు. తామర పువ్వులపొడి గాలి కెగిరి సమీపంలోనికాలువ నీటి అలలమీద పడింది. ఆ అలలు ముద్దుపెట్టుకుంటూ గుస గుసలాడుతుంటే ఆ చలువ రాళ్ళు పసుపుమెత్తిన ముత్తయిదువుల్లా ఉన్నాయి. ఆ రాళ్ళ మీద కూర్చున్న జవరాళ్ళుకూడా సరస శృంగార సల్లాపాలలో లీనమవుతున్నారు.

"చూడవే ఈగున్న మామిడి యెంత గుంద్రంగా ఉన్నదో! పైగా విరియ బూచిన పుప్పొడి గంధాన్ని అలదుకొని వనలక్ష్మి వత్తువస్తనంలా ఉంది-- దానిపై చివర నల్లని కోకిల కూర్చుని ఆస్తనాగ్రంలా మెరిసి పోతోంది."

'చూశారర్రా! ఇక్కడి సంపెంగపువ్వులు వనదేవతల యిళ్ళలో ఎత్తిన దీపశిఖలల్లా ఉన్నాయి. కాకపోతే చీకట్ల వంటి నల్లని తుమ్మె దల గుంపు పారిపోతుందా?' అన్నదొక వనిత.

ఒకామె రంభకు అరటి చెట్లను చూపిస్తూ ' ఆ రంభని చూడవే! అనురాగసుమనయై (ఎర్రని పువ్వులతో కూడి) సోమరి

వలె వంగి తపసిని (గారచెట్టును) కౌగలించుకున్నది! దీనిని చూస్తే నువ్వు అనురాగంతో ఆ విశ్వామిత్రుణ్ణి కౌగలించుకోవటం తప్పు కాదనిపిస్తోంది.' అని చెప్పగా విని రంభ నవ్వింది.

'చూడవే ఆ దాసన చెట్టును! రెండుకళ్ళకూ మిరుమిట్లు గొలిపేలా పూచి, యెర్రని కాంతులినుతూ ఆ దాసనిచెట్టు ఈ తమాల (చీకటి) వనానికే ఉదయ భానుడిలా అయింది, అన్నదొకబొమ్మ.

"చూశారా, ఆ పోకచెట్టు ఆకుల గుంపు నల్లని మేఘంలా ఉంది. వాటి బోదెలు వానకాళ్ళవలె (వాన కురియటానికి ముందు మేఘాలనుండి వ్రేలాడే నీటివాళ్ళు) కనబడుతూ ఇది వానాకాలమేమో అనిపిస్తున్నాయి' అన్నది ఒక మగువ.

"చూశారే, ఈ ఇప్ప మ్రానులెంత అందంగా ఉన్నాయో! ముత్యాల రాసులతో నిండిన తామ్రపర్ణీ నదీతీరంలా వీటి మ్రానులు ముత్యాలపంటి ఇప్పపూలరాసులతో చూడముచ్చటగా ఉన్నవి" అని ఒక మహిళ చూపించింది.

"చూశారరా, ఆ అశోకవృక్షపు చిగురుటాకు! విరహంతో పరితపించే స్త్రీ పురుషుల మీదకి తన సైన్యాన్ని లంఘించమని ఆజ్ఞాపించే మన్మథుడి అరచేయిలా ఉంది" అన్నదొక పూబోడి.

"ఛ, ఛ! మగవాళ్ళ బుద్ధులెలా ఉంటాయో చూడండే! పాపం ఆ ఆడకోయిల లేత చిగురాకులు తింటున్నది. పాడు తుమ్మెద దాని ముక్కు మీద కుట్టింది. ఆ బాధకది తాళలేక కుహూ కుహూ అనుకుంటూ చెట్లకొమ్మల మీంచి దూసుకుంటూ యెగిరిపోతోంది. దాని బాధను ఉపచరిస్తున్నట్లుగా నటించి, ఆ మగకోకిల దాని వెంటపడి మోమున మోము చేర్చి ముద్దు పెట్టుకుంటుంది.

కాస్త సందు దొరికితే చాలు ఈ మగాళ్ళు, ఆడవాళ్ళను ఎలాగయినా మోసం చేసేస్తారు" అని అందులో అనుభవం గడించిన ఒక ఎలనాగ చెప్పింది.

ఈ విధంగా ఎవరికి తోచిన కవిత్వాన్ని వారు పలకబోస్తూ, పువ్వులు త్రుంచుతూ, జడలల్లుకుంటూ, సన్నని పమిటలను నడుముకు చుట్టూ 'చనుకట్లు' గా మలచి కట్టుకుంటూ పువ్వుల్ని కోసుకోవటంలో నిమగ్నమయ్యారు.

నలుగురు ఆడవారు కలిస్తే అంతా శృంగారమే; ఏపని చేస్తున్నా ఆ మాటల మత్తు మైమరపించవలసిందే! వారి హాస్యోక్తులకు హద్దూ, ఆపూ లేవు.

'చూడవే దానికి పువ్వులంటే యెంత ప్రేమో; మొదటి పువ్వును మన్మధుడికి అర్పించకుండా తన తలలోనే తురుముకుంది.' అని వెక్కిరించింది ఒకర్తి.

"ఎందుకే పావురపు కూత వింటున్నావ్?" అన్నదొకర్తి.

"అది వింతగా ఉన్నదే" అన్నది మరొకర్తి.

"అది విరహిణులను బాధ పెట్టే బేరజమే (పురుష వచనమే)" అని మరొకర్తి--

"ఒసేవ్ ఇలారండర్రో. ఈ సురపొన్న చెట్టుకు నాలుగు కడల నుండి ముట్టడిద్దాం. దీని తావితండము మన క్రొత్త కొప్పులకు తరగదే" అని అన్నది ఒకామె.

"అబ్బబ్బ, ఉండవే! ఇలా నా మీదకి త్రోసికొచ్చి, కంటకాలు (నిష్ఠురోక్తులు) ఆడతావేమో! నా కాలిలో కంటకం (ముల్లు) దిగింది చూశావా?" అన్నదొకామె.

"ఆ మొల్లలు నీకివ్వనే. నా కొప్పులో పెట్టుకుంటున్నాను చూడు. వాటికి వెల యిమ్మంటున్నావు! ఇవ్వను. నీ వెలయాలి తనాన్ని ఇకనయినా మానుకో" అని వెక్కిరించింది ఒకామె.

"నువ్వేమో మన్మధుణ్ణి తిట్టిపోసినట్టున్నావు. నీమీద కోపం వచ్చి, చిగురుటాకు బాణాలతో దండెత్తి వచ్చినట్లు ఈ పొగడను చూస్తే తెలియటం లేదా?"

'ఈ ప్రియాళుపుష్పం పుప్పాడితో నిండుగా ఉంది. ఆ బుక్కాను నాకిస్తే నా మణికంకణం నీకిస్తా'.

"ఈ మొగలిపూల పరాగాన్ని చెంచెతలు బుక్కాగా పూసుకుంటారు కదే"

" ఆ విరజాజిలత తేనెతో ఏందునిస్తే ఆ ఆత్రిగొట్టుతుమ్మెద వేరే పువ్వుల రుచి మరిగి నిర్లక్ష్యంగా వెళ్ళిపోతోంది."

'ఏయ్ పిల్లా! ఆ పోక చెట్టును రొమ్ములపై ఎగబ్రాకాలని చూస్తున్నావా? ఏమమ్మా అంతలా సలుపుతున్నాయా'.

"ఏమే కరికుంభకుచా! (ఏనుగు కుంభాల వంటి చనులు గలదానా) దొంగగాలి ఆ గురివింద పువ్వుల్ని కొల్లగొట్టింది చూడు! జాగ్రత్తగా ఆ పొదలలో దూరి ఆ పువ్వుల్ని నువ్వు దోచుకో".

'ఒసేయ్, అలా దూరదూరంగా పోతావేమే? ముందుకొచ్చి ఈ పట్టి వేరు తీసుకో'.

ఇలా వేళాకోళాలాడుకుంటూ ఆ అతివలు పువ్వుల్ని కోసుకొని ఒకచోట చేర్చి, జలక్రీడలకు పూనుకున్నారు. ఆ సరస్సులో తామర పువ్వుల తేనెను త్రాగి మత్తెక్కిన ఆడుహంసల్లా విహరించారు.

పాపం వరూధిని అందరికీ దూరంగా ఒక్కర్తీ కూర్చువి ఉంది.

విరహ పీడచేత ఆమె మొగమూ, కళ్ళూ కళ తప్పి వున్నాయి. జల క్రీడలకు రమ్మని ఆహ్వానించే స్నేహితురాళ్ళకు రానని చెపుతూ ఒంటిచేతితో నమస్కరిస్తోంది! శూన్యదృష్టితో నలుగడలూ చూస్తున్నది.

ఎండలో తిసరేణువుల మధ్యన చిక్కుకుని తుమ్మెద గుంపులు ఆడుతున్నాయి. కలువలు విరబూచిన కాలవల నుండి పుప్పొళ్ళు గాలిలోకి ఎగురుతూ వున్నాయి.

అటే చూస్తున్నది వరూధిని.

ఆ పుప్పొడుల మధ్య కంకణం కట్టిన చెయ్యి యెవరిదో పైకి లేస్తున్నది. వీణాధ్వనితో సమంగా జతచెప్పే యెర్రని పెదవులమధుర ధ్వానాలు లీలగా గాలిలో వినిపిస్తున్నాయి. యెవరివో కళ్ళు మెరుస్తూ దారిని వెతుక్కుంటున్నాయి. రాను రాను ఆ బంగారపు మేను కాంతి ఆమె కళ్ళలో పడింది. తుమ్మెదలకన్నా నల్లనయిన పెద్దజుట్టు పిరుదుల దాకా వ్రేలాడుతున్నది. దేవతార్చనకు పువ్వుల్ని కోస్తున్నట్లు కనిపించాడా మనిషి.

చూస్తూనే చటుక్కున లేచింది వరూధిని. ఆమె మొలనూలు గంటలు ఘల్లుమన్నాయి. చెలికత్తెలతో ఏమీ చెప్పకుండానే అటువైపు బయలు దేరింది. వారి కంట పడకుండా ఉండటం కోసం తన పసుపుపచ్చ మొగలి పువ్వులాంటి శరీరాన్ని పొదరిళ్ళలో దాచుతూ, మధ్య మధ్య మెరుపులా మెరుస్తూ బయలు దేరింది. ఆహా! అతనే... అతనే ... ప్రవరుడు, యెంతటి అదృష్టవంతురాలు!-

ఆమె కన్నుల వెంబడి ఆనందబాష్పాలు జలజల రాలాయి. యెర్రవారిన కన్నులను కనురెప్పలతో సగం కప్పి కొలకులలోంచి

మళ్ళీ చూసింది. కసికొద్దీ మన్మథుడు తాంబూలపురసంలో ముంచిన బాణాన్ని తీసి సంధించినట్టుగా యెర్రెర్రగా ఉన్నాయి ఆమె చూపులు.

మొదట అతని కళ్ళను చూడగానే ఆమె గుండె జల్లుమంది. రెండు మూడు అంగలు ముందుకు నడవగానే కాళ్ళు తొట్రుపడ్డాయి. ఇంకాదగ్గరకు వెడుతున్న కొద్దీ ఆమె ముఖంలో దైన్యం తోచింది. ఇక నిలబడి చూచినప్పుడు కనురెప్పలు చలించాయి. కంఠం గద్గదమయింది. కొంగుచేతితో పట్టుకున్నప్పుడు చెమట పట్టింది. మాటాడబోయి వాని మొగాన్ని స్పష్టంగా చూడబోతే, చూడనివ్వకుండా కన్నీరు అడ్డం వచ్చింది.

కళ తప్పి పాలిపోయిన ఆమె చెక్కిళ్ళ మీంచి కాటుక కన్నీరు ప్రవహిస్తున్నది. నోటమాటరాక పోతే గొంతు సవరించుకుని చివరికిలా అంది.

"ఎందుకురా ఇంత పట్టుదల! తియ్యమామిడి గున్నలలో అలముకున్న మాలతీ తీగెల పొదరిళ్ళలో నన్ను ఏలుకోరా! గడచిన రాత్రి నాలుగు జాములూ మన్మథబాధకు తాళలేక 'ఈ జన్మ ఇక చాలులే' అన్నంతటి మన్మథుని హింసకులోనయి, ఇప్పుడు నీ వశమయితినిరా'.

"రా! నీకు వైరాగ్యం యెక్కువయి నిర్దాక్షిణ్య చిత్తంతో రాకపోతే, నీతో హొరాహొరిగా పోరి నిర్బంధం చెయ్యను. నీ ఆచారంతో నువ్వుపోయి సుఖంగా బ్రతుకు. నీయందు వాంఛతో నాకుచావే, మరో దుర్దశో కలిగితే కలగనీ.

'కఠిన హృదయంతో నువ్వు నీ మనస్సును రాయి చేసుకున్నావు. ఎంతకీ కరగవు! నీ పట్టినపట్టు విడవవు. నా అదృష్టం

అలా ఉంది. నిన్నని ప్రయోజనం లేదు.'

అనేసరికి ఆ దొంగ బ్రాహ్మడు కామినుల తోడి సల్లాపాలకు అలవాటయిన విలాసపు చూపుల్ని ప్రసరించాడు. అతని కోరిక నెరవేరినందుకు సంతోషించాడు. ఆ చిరునవ్వును, ఆమెను చూడటం తోనే కలిగిన శృంగార చేష్టల తమకాన్నీ, శృంగార రసావేశంతో నోటరాబోయే మాటల్నీ అణుచుకున్నాడు-- తలవంచిగాఢంగా నిట్టూర్చాడు. నేలను బొటనవ్రేలితో ఒకింత సేపు వ్రాశాడు. కాస్సేపు ఆగి, నిలబడి, తలపైకెత్తి సన్నని కంఠంతో ఇలా అన్నాడు.

నన్ను కానక నా తల్లీ తండ్రీ మనస్తాపంతో కృంగిపోతున్నారు. నా భార్య నాకోసం ఏడుస్తూ ఉంటుంది. యజ్ఞాగ్ని చల్లారిపోతూ ఉంటుంది. ఇల్లు శూన్యంగా వుంటుంది. ఇక్కడ నేనిలా చిక్కిపోయాను. ఏ సుఖం కోరి నేను ఇక్కడ భోగింపగలనో చెప్పవే' అన్నాడు.

' ఓ కమలలోచనా! నీ అంతటి అందగత్తెతో రతియందు కలిగే స్వయం గ్రహానందం ఆ దేవేందుని కయినా లేదు ! అంతటి అదృష్టం నన్ను వరించి వస్తే వద్దనటానికి నేను సన్యాసిని కాదు గదా! కాని, ఊరటలేని దుఃఖం గల వాళ్ళకి సర్వమూ అసహ్యమే! (అనాశ్వాసిత దుఃఖితే మనసి సర్వమసహ్యమ్) అన్న పెద్దల మాటవినలేదా?

"సరే కానియ్ నీ ధైర్యాన్ని చూడలేక నావ్రతాన్ని విడిచి పెడుతున్నాను. నేను వ్రతం చెడ్డా ఇతరులకు మేలయితే చాలు. అవసరమయితే ఇతరుల కోసం శరీరాన్ని ఉపేక్షించాలి గదా!

"తొందరపడక మరో విషయం చెపుతాను. రతి సమయంలో నువ్వు నీ రెండు కళ్ళూ మూసుకోవాలి సుమా! ఇది మాదేశాచారం.

ఒక్క కన్ను తెరచినా పాపం వస్తుంది." అన్నాడు ప్రవరుడు.

నిద్రలోనూ, సంభోగసమయంలోనూ, మరణ సమయంలోనూ మనుష్యుల నిజస్వరూపం బయటపడుతుందని శాస్త్రం. తన మాయ వెల్లడి కాకుండా ఉండేందుకే ఈయన ఆ కట్టడి చేశాడు.

" ఆ మర్యాదకు నీవు ఒప్పుకుంటే మంచిదే. కాకుంటే నేనెలాగూ ఈ శరీరంతో మాయింటికి తిరిగి వెళ్ళలేను గదా! ఈ మందాకినీ నదీతీరంలో యీ మునులతో, ఈ చెట్టుచాటునే ఉండి, నేను చంపదగని వాడనని విధికి మొరపెట్టుకుంటూ తపస్సు చేసుకుంటాను.

" ఇంకో మాట చెపుతా వినుు. వ్రతం చెడ్డా, సుఖం దక్కాలి గదా! నీ కోరిక తీరగానే నన్ను పొమ్మనకూడదు. నిన్ను ఒప్పించి నేను వెళ్ళాలి గాని."

" ఇంతిలా ఎందుకు చెపుతున్నానే వినుు. నేను పరదేశిని. బంధువుల్నీ, మిత్రుల్నీ, కళత్రాన్నీ దూరం చేసుకుని, దైవయోగం వలన ఇంత దూరం వచ్చాను. నీ కోసం నీ ప్రార్థన మీద నా వ్రతాలను, హోమాలనూ, అనుష్టాలనూ, విడిచి పెట్టవలసి వస్తోంది. కనుక నా మనస్సులోని మాట చెపుతున్నాను.

'ఓ వరూధునీ, జవ్వాది వాసనతో తొణికిసలాడే నీ చనుదోయిని కౌగలించుకుని చిరకాలం ఇహసుఖాన్నయినా పొందాలి. లేదా గాఢతపస్సు చేసుకుని పాపవిముక్తుడినయి పుణ్యాతిశయంతో పరలోక సుఖాన్నయినా పొందాలి. ఈ రెండింటికీ చెడిన రేవడిని కాకూడదు గదా!' అన్నాడు.

ఆ మాటలతో వరూధునికి ఆశ కలిగింది. ఆమె ముఖం వికసించింది.

తలవంచు కొంది. నవ్వుకొంది. అంది గదా!

'ఆహా! నీ కారిన్యాన్ని విడిచి పెట్టి కేవలం దయామయుడివయి 'నిన్ను విడువ'నని నా చెవుల కింపుగా అన్నావు కదయ్యా! మన్మథుడి చేత నేనింక వెట్టి చేయించుకుంటాను. ఆనంద సముద్రంలో మునిగిపోతున్నాను. ఇంక నానోములు పండినాయి. నా వయస్సు చరితార్థమయింది. నీవెలా చెపితే అలా చేస్తా', అని.

ఇంతలో చెలికత్తెలంతా పరుగెత్తుకుంటూ వచ్చి వారిద్దర్నీ చూశారు. కిలాకిలా నవ్వారు.

ఆ చెలికత్తెలు చూస్తూఊరుకోలేదు. నోటికి వచ్చినట్టుగా ప్రవరుణ్ణి అన్నారు.

'ఏమయ్యా, అంత నిర్దయ బుద్ధివా?' అన్నది రంభ.

'ఆహా, ఏవేకివిలే' అన్నది హరిణి.

'చేదు మ్రింగుతాపులా ఉంది' అంటూ నవ్వింది ఘృతాచి.

'మాయవాడివిలే' అన్నది మంజుఘోష.

ఊర్వశి అతని మనసునొచ్చుకుండా నిష్ఠూరాలాడింది.

" చాల్లే, రా" అంటూ చంద్రలేఖ జంకించింది.

' మాచెలికత్తెను ఇలా బాధపెడతావుటయ్యా" అంది మేనక.

'ఇంక మాయల్ని మానెయ్ ' అంది హేమ.

'నువ్వు మంచివాడివి కాదు' అంది తిలోత్తమ.

ధాన్యమాలిని అతన్ని రమ్మని ప్రతిమాలింది.

'రాడూ? రాకపోతే యెరగడూ?' అంటూ బెదిరించింది. పుంజికస్థల.

ఈ విధంగా ఆ దేవతా స్త్రీలు ఆ గంధర్వుడిని ముట్టడించి,

ఒకర్నొకరు తోసుకుంటూ ఈతని మీదిమీదికి వెళ్ళి నవ్వుకోవటం సాగించారు.

ఆ దొంగ బ్రాహ్మడు ఆ కాంతల సరససల్లాపాలను వింటూ మనసులో ఎంతో సంతోషిస్తూ వారితో కలిసి బయలు దేరాడు.

తిన్నగా అందరూ ఒకచోటికివెళ్ళారు. అక్కడ కస్తూరి గుప్పుమని పరిమళిస్తున్నది. ఆకాశ గంగ నుండి చెలరేగిన తుంపురులు తొణికిపడుతున్నాయి. పొగడ చెట్ల నుండి వచ్చేగాలి ప్రసరిస్తోంది. పచ్చకర్పూరపు అరటిచెట్లనుండి ధూళివస్తున్నది. ప్రక్కనే సెలయేళ్లు ఉరకలు వేస్తున్నవి. చిగిర్చిన మామిళ్ళు సంధ్యా రాగాన్ని ప్రదర్శిస్తున్నవి. తొలి (Dawn) సంజకెంజాయలో నవ మాలికలు తేనె బొట్లను రాలుస్తున్నాయి. మాణిక్య దీపాలు వ్యాపించి ఉన్నాయి. తుమ్మెదలు యెలుగెత్తి గానం చేస్తున్నాయి. గోరువంకలు మన్మథశాస్త్రాలను చదువుతున్నాయి. చిలకలు, కోయిలలు, పావురాలు మదించి పాడుతున్నాయి.

అందులో ఉన్న రత్నమయగృహంలోకి వరూధిని ప్రవరునితో కలిసి ప్రవేశించగానే చెలికత్తెలు నవ్వుకుంటూ వెళ్ళిపోయారు.

అప్పుడు వాళ్ళిద్దరూ గబగబా లతా గృహంలోకి ప్రవేశించి, విరహోత్కంఠతతో ఒకరినొకరు అల్లుకున్నారు. యెర్ర కలువలు పరచిన పాన్పుమీద ఉభయులూ పడుకుని మనస్సులు కోరికతో ఉప్పొంగి పోతూండగా సంభోగం ప్రారంభించారు.

అనుకోకుండా అతడు ఆమె గోరువెచ్చని స్తనాలను కౌగ లించుకున్నాడు. మొదలంటూ ఆమె రెండు పెదవుల్ని ముద్దు పెట్టు కున్నాడు. ఆమె పళ్ళుసలుపుతో బిగిసిపోయాయి. ఆమె అలసటతో

అలసటతో సెజ్జయందు సోలిపడిపోయింది. ఆమె కంఠం నుండి రతి ఉద్వేగసుఖాన్ని సూచించే కూతలు (మణితం) వెలువడ్డాయి. ఆమె చెక్కిళ్ళను నెమ్మదిగా అతను వాయించాడు. ఇక విడువలేని విరహంతో ఆమె తన శరీరాన్ని అతని శరీరానికి గట్టిగా అదిమి పెట్టింది. ఆమె శరీరం ఆనందంతో గగుర్పాటు చెందింది. ఆమె హాహాకారాలు చేసింది. అతని రసజ్ఞత మెచ్చుకుంటూ కళ్ళు అర మోడ్చింది. ఆమె చెక్కిళ్ళను పూర్తిగా అతని నోటికి ఆధీనం చేసింది. ఇక ఏవిధమయిన శృంగార చేష్టలనూ చేయలేని అలసత్వం ఆమెని ఆక్రమించింది. ఆమె కంఠంలోని నగలు ధ్వనించటం మానివేశాయి. ఆమె తొలిరతి ఆ గంధర్వరాజును కరిగించివేసింది.

ఆ వరూధిని పారవశ్యం చేత కన్నుమూసుకోవటం, కౌగలించే బిగిని కోల్పోవటం, రతి చాతుర్యాన్ని కోల్పోవటం గమనించాడు ప్రవరుడు. అదంతా అతనికి కన్నెరికపు రతిలా తోచింది. ఎంతోసంబరపడ్డాడు.

ఈ విధంగా వారిద్దరూ ఎన్నో ప్రొద్దులు మన్మథ వ్యాపారంలో మునిగి తేలుతూండగా వరూధి నికి నెలతప్పింది.

నడక మందగించింది.నూగారుస్నుటుంగా విరిసింది. చనుమొనలు నల్ల బడ్డాయి. శరీరం నీరసించింది. ఆయాసం, నిద్ర, అరుచి ఎక్కువయ్యాయి.

ఆమె చిరునవ్వులు పలచబడి బుగ్గలపై కెక్కినట్లుగా చెక్కిళ్ళు తెల్లగా ఉన్నాయి. ఆనందంతో ఆమె కోరికలు సముద్రతరంగాలల్లా విరగబడగా నోట నురగలతో కూడిన చిన్న చిన్న ఉమ్ములు వెలువడ్డాయి.

పేదవాడు అనాటి కానాడు బలవంతుడయి బందిపోటుగా మారి పొరుగువారిని బ్రతక నివ్వనట్టు ఆమె పేదనడుము రోజురోజుకీ లావెక్కి పొట్టమీద ఉండే మడతల్ని తరిమి వేసింది.

ఆ గర్భభారం వలన ఆమెకు అలసట ఎక్కువై పాటలు పాడటం మానింది. ఆటలు ఆడటం మానింది, విరహిజనాన్ని బాధించి, బాధించి--ఇక పనిలేక మూలపడ్డ మన్మథుని చాపంలా ఉంది వరూధిని.

అయినా మనస్సు కక్కురితి ఉంటుంది గదా! అదిబాధించగా నెమ్మదిగా లేచి చేతులతో అతన్ని నీరసంగా కౌగలించుకునేది. అలసటతోనే మట్టితిన్న తన నోటితో అతని అధరాన్ని కొంచెం కొంచెం కొరుక్కునేది. ఊపిరి బిగబట్టి మణితాన్ని చేయగల ఈ వరూధిని శక్తి చాలక హాస్యోక్తులతో తృప్తి పడటం ప్రారంభించింది. అతను రతినికోరితే, అందుకు తన శరీరం వశం కాక నిట్టూర్పులు నిగుడించేది.తన కోరిక యెరిగి అతనామెను రమించినప్పుడు మెచ్చుకునేది. అతనికే కోరిక కలిగి తనతో పరిహాసాలు చేస్తున్నప్పుడు వద్దువద్దని బ్రతిమాలుతూ దీనస్వరంతో వేడుకునేది.

ఈ విధంగా ఆ మాయాప్రవరుడు తన పచ్చిన పనినెరవేరటం, ఆమె గర్భశ్రాంత అయి తనను దూరంగా ఉంచటం గ్రహించి తొందరగా అక్కడనుంచి వెళ్ళిపోవటం మంచిదనుకున్నాడు.

ఎప్పటికయినా జరిగిన మోసం ఆమెకు తెలిసిపోవచ్చును. తెలిస్తే ఆ అచ్చర కాంత తనను శపించనూ వచ్చు. చెప్పకుండా వెడితే మన్మథతాపానికి గురై ఆమెనశిస్తే ఆ పాపమంతా తనకు చుట్టుకోనూ వచ్చు.

అందుకే ఆమెను ఒప్పించి, వెళ్ళిపోవాలనుకున్నాడు. అనుకుని, ఆమెకు సమీపించి, కొంతసేపు బుజ్జిగించాడు.

"ప్రియా, నా పాదాలకు లేపనం వ్రాసి నా చేత ఇన్నిపనులు చేయించిన ఆ యోగి ఈ కొండకు వచ్చాడు. నేనాయన్ని ఇవాళనే చూశాను. అతను మా ఊరు వచ్చిన నాటినుంచీ, నేను ఇక్కడకు వచ్చిన తరువాత మా యింట్లో జరిగిన సంగతులన్నీ చెప్పాడు. ఏమి చెప్పను?

"అదనూ పదనూ కనిపెట్టి దున్నే నాధుడు లేక మా పొలాలన్నీ యెండిపోయాయిట. కట్టేవాడూ, వేళకు విప్పేవాడూ లేక మా పశువులన్నీ పొరుగు గ్రామాల బందెల దొడ్లలో చిక్కుకున్నాయట! ఇంతకు ముందు నేను చెప్పిన చదువులన్నీ మరిచిపోయి నా విద్యార్థులు ఊళ్ళోని తగువులన్నీ మీద వేసుకుంటున్నారట. మాకు అప్పులిచ్చే వారు ఇవ్వటం లేదట. మా వద్ద అప్పుతీసుకున్న వారు మోసం చేస్తున్నారట. పండుగ రోజులలో మాకు రాజు లిచ్చు కానో, వీసమో రాకపోవటంతో మా పొలాలన్నీ తాకట్టులోకి పోయాయట!-యజమాని లేని యిల్లు యెలా ఉంటుందో చూడు.

"అదీగాక నేను వచ్చినప్పటి నుంచీ నా ముసలి తలిదండ్రి లిద్దరూ దుఃఖంతో నాకోసం యెదురు తెన్నులు చూస్తున్నారట! కంటినీరు కట్టువడక తిండి సరిగా తినక, శరీరాలు క్షీణించి, మంచాలకు అంటిపెట్టుకుని కొన ప్రాణంతో బ్రతుకుతున్నారట."

ఆ ముసలి ప్రాణాలు నామూలాన హరీ మనకుండా నేను వెళ్ళాలి గదా! నీకు తెలియని ధర్మమూ, అధర్మమూ ఉన్నాయా? నీవేచెప్పు.

అన్నాడు ప్రవరుడు. తన భార్యసంగతి మాత్రం ప్రస్తావించ లేదు! ఆ మాట ఎత్తితే వరూధిని ఒప్పుకోదని ఎరుగును.

"యెర్రగా కాలిన ఇనుము కడవల కొద్దీ నీటిని పీల్చునట్లు కోరికలతో పరితపించే మనస్సు ఎన్ని భోగాలయినా, ఎంతకాలమయినా అనుభవించాలనే చూస్తుంది. దానికి తృప్తీ, విశ్రాంతీ ఉండవు. అలా అని ఏదో మిష చేత ఇక్కడ నుంచి వెళ్ళిపోవాలనుకోవటం లేదు. నా మోహం, అనురాగం, ఇష్టం, మనస్సూ నీయందే ఉన్నాయి. నిన్ను విడిచి యెలా వెళ్ళగలను? అలా అని ఉండిపోతే తుమ్మెద సంపెంగి పూదేనను (సంపెంగి పూలకు తేనె ఉండదు) ఆశించి, దాని ఘాటయిన పరిమళానికి మూర్ఛపోయి, కదలలేక నశించినట్లు కావలసిన వాళ్ళకు దూరమయి నశించిపోతాను. అది కూడా మంచిపని కాదు గదా!"

"ఎవడు ముందు సంగతి ఆలోచించకుండా భోగాలలో చిక్కుకుని, మంచిచెడ్డలను తెలుసుకోకుండా పశుప్రాయుని వలె సదాచారాన్నీ, ప్రతిష్టను ధనాన్నీ నాశనం చేసుకుంటాడో వాడు ఇహమందు నలుగురిలోనూ నవ్వుల పాలవుతాడు. పరమందు నరకంలో పడతాడు."

అంటూ వరూధినికి నచ్చచెప్పాలని చూశాడు ప్రవరుడు.

ఆ మాటలు వినేసరికి వరూధి ని సొమ్మసిల్లి పోయింది. గుండెలు కొట్టుకున్నాయి. కళ్ళనుండి అశ్రువులు బొట్లుగా రాలి, రెప్పలందు కొంచెం నిలచి, మీద ప్రవాహమయి, కెరటాలయి కుచాలపై నున్న కస్తూరి కరిగిపోయేటట్లుగా సముద్రం పొర్లిక్కినట్లుగా ఏడ్చింది.

"వెర్రిదానా, యెందుకలా యేడుస్తావు. ధైర్యం గల వ్యక్తివి

నీవే ఇలా బేలపడటం తగునా? దేవతా స్త్రీ లంతా సమస్తమూ తెలిసిన వారని విన్నాము. యోగవియోగాలు నిత్యమా? అంత మాత్రాన అతిముఖ్యములుంటే చేసుకోవటం మానతామా? ప్రాణంతో సమంగా ప్రేమించే మనుష్యులు పోతూ ఉండటం, వస్తూ ఉండటం జరగదా? మనుష్యులు దూరంగా వెళ్ళినంత మాత్రాన మమతలు దూరమవుతాయా? ఎక్కడికీ వెళ్ళకుండా ఎప్పుడూ ఒకచోటే కాళ్ళు తెగినట్లు పడి ఉండటం సాధ్యమా?

"వచ్చిపోయే విద్యను నాకు ఆ మునీశ్వరుడు ఈసారి దాపరికం లేకుండా చెప్పేశాడు. కనుక వస్తూపోతూంటాను. నిన్ను విడిచిపెట్టను. త్రికరణ శుద్ధిగా నా మాట నమ్ము."

అంటూ వరూధి నిని ఊరడించి, ఆ గంధర్వుడు యెగిరి పోయాడు. ఋణానుబంధం తెగిపోతే యెంతపేమయినా తొలగిపోక తప్పదు గదా!

రతి పారవశ్యంలో సహజంగా వరూధినికి కళ్ళు మూతబడ్డాయి కదా! ఆమె కళ్ళల్లో ఆ ప్రవరుని తేజస్సునే ఆమె రతి సమయంలో ధ్యానిస్తూ ఉన్నందున, నవమాసాలు గడవగానే ప్రవర తేజస్సు గల కొడుకు పుట్టాడు ఆమెకు. అతడే మనువు. ఈ మాయాప్రవరుడు చీకటి చేసిపోయిన ఆయింతి గుండెలలో ఈ మనువు దీపాంకు రచ్ఛాయను వెలిగించాడు. అతణ్ణి పెంచుకుంటూ, ఛిద్రమయిన తన జీవితాన్ని తలచుకుంటూ ఆమె - ఆ వరూధిని - తన మనో నాధుడు యెప్పుడు వస్తాడో అని ఎదురుతెన్నులు చూస్తూ అలాగే ఉండిపోయింది.

-సమాప్తం-

రాంషా – శిరీష రచనలు

1. స్వయంతృప్తి	రు. 5.00
2. సృష్టి రహస్యం 1వ భాగం	రు. 15.00
3. సృష్టి రహస్యం 2వ భాగం	రు. 15.00
4. మనోలైంగిక వ్యాధులు	రు. 15.00
5. లైంగిక సమస్యలు	రు. 15.00
6. రతి రహస్యం	రు. 10.00
7. నాగరిక దాంపత్యం	రు. 5.00
8. దాంపత్య రహస్యం	రు. 15.00
9. ప్రణయకళ	రు. 15.00
10. కామశిల్పం	రు. 20.00
11. సంతానం 1వ భాగం	రు. 10.00
12. సంతానం 2వ భాగం	రు. 10.00
13. పిల్లల పెంపకం	రు. 10.00
14. శృంగారం	రు. 10.00
15. సౌష్టవం	రు. 5.00
16. తీయని బాధ	రు. 5.00
17. యోగశాస్త్రం	రు. 3.00

18. హేతువాదం	రు. 10.00
19. సాంఖ్యమ్	రు. 5.00
20. వైశేషికం	రు. 5.00
21. రాంపా సుభాషితాలు	రు. 5.00
22. కామేశ్వరి కథ	రు. 5.00
23. పెళ్ళి తిరకాసు	రు. 5.00
24. మీనాక్షి ముద్దు	రు. 5.00
25. మనస్తత్వాలు	రు. 5.00
26. అనంతం	రు. 5.00
27. కామజిజ్ఞాస	రు. 5.00
28. కామప్రవృత్తి	రు. 5.00
29 గర్భధారణ సమస్యలు	రు. 10.00
30 వరూధిని	రు. 5.00
31. గౌతమ ధర్మశాస్త్రం	రు. 20